**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 97003 70499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 97003 70499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్‌ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 25-06-2025 | సంపుటి : 11 | సంచిక : 148 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

**దీనిపై దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలి**
**తెలంగాణ వాడుకోగా మిగిలిన నీటినే వాడుకుంటాం**
**తెలంగాణ అనేక ప్రాజెక్టులు కడుతున్న అడ్డుకోవడం లేదు**
**కేబినేట్‌లో సీఎం చంద్రబాబు వెల్లడి**

అమరావతి,జూన్24 : పోలవరం బనకచర్లపై తెలంగాణ నేతలు అందరూ మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణ కేబినెట్‌లో బనకచర్లపై వాళ్లు డిస్కస్ చేశారని అన్నారు. ఏపీ కూడా మన వాదనలు వినిపించాలని సూచించారు. తెలంగాణ వాళ్లు అనుమతి లేని ప్రాజెక్టులను కూడా కడుతున్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇంకా చాలా ప్రాజెక్టులను వాళ్లు కడుతున్నారని తెలిపారు. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లను మాత్రమే కదా ఏపీ వాడుకునేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణ నేతలు బనకచర్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వరద జలాలను మనం వాడుకుంటామని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో కూటమి నేతలు చెప్పాలని ఆదేశించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై మనం దశల వారిగా ముందుకు వెళ్తామని సూచించారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం ఏం చెబుతుందో దాని ఆధారంగా మనం నిర్ణయం తీసుకుందామని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఎప్పుడూ శంకుస్థాపన చేస్తామనేది త్వరగా నిర్ణయించాలని మంత్రి లోకేష్ అన్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌కి అవసరమైతే కేంద్ర ప్రభుత్వ జోక్యం కూడా అవసరమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విషయం అర్థమయ్యేలా చెప్పేందుకు అవసరమైతే కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై నేతలు పూర్తి అవగాహనతో



జాగ్రత్తగా మాట్లాడాలని దిశానిర్దేశర చేశారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది.' అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు ఏడాది పాలనపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జులై 1వ తేదీ నుంచి ఏడాది పాలనపై ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి వివరించాలని నిర్దేశిరచారు సీఎం చంద్రబాబు. కూటమిలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

# నా మాటలు బీజేపీలో చేరడానికి సంకేతం కాదు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇతర దేశాలతో సంబంధాలను బలపరచుకోవడంలో శక్తి, చైతన్యం ప్రదర్శించారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసం కాంగ్రెస్‌ను మరోసారి ఇరుకున పెట్టింది. శశిథరూర్ బీజేపీలో చేరనున్నారంటూ ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనిపై శశిథరూర్ తాజాగా స్పందించారు. తన వ్యాఖ్యలు ప్రధానమంత్రి పార్టీ లో చేరడానికి ఎలాంటి సంకేతము కాదని వివరణ ఇచ్చారు.ఆపరేషన్ సింధూర్ విజయాన్ని వివరిస్తూ అన్ని పార్టీల ఐక్యతను ఆ వ్యాసంలో తాను ప్రస్తావించానని చెప్పారు. ఇతర దేశాలతో సంబంధాలను బలపరుచుకోవడంలో మోదీ శక్తి, చైతన్యం ప్రదర్శించారని తాను చెప్పానని, ఇది ఎంత మాత్రం బీజేపీ విదేశాంగ విధానమో, కాంగ్రెస్ విదేశాంగ విధానం గురించో కాదని, భారతదేశ విదేశాంగ విధానం గురించి మాత్రమేనని శశిథరూర్ తెలిపారు. పదకొండేళ్ల క్రితం పార్లమెంటు విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఈ విషయం తాను చెప్పానని గుర్తు చేశారు.పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్‌కు వ్యతిరేకంగా మొదలైన దౌత్యయుద్ధంలో భాగంగా ఏర్పాటుచేసిన ఏడు ఎంపీల బృందాల్లో ఒకదానికి శశిథరూర్ నాయకత్వం వహించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన దౌత్య కృషి మన జాతీయ సంకల్పం, ప్రతిభావంతమైన వ్యక్తీకరణకు నిదర్శనంగా నిలిచిందని శశిథరూర్ తన వ్యాసంలో పేర్కొన్నారు. భారతదేశ ధృడ వైఖరిని ప్రపంచానికి చాటిచెప్పిందని తెలిపారు. ప్రధాని శక్తి, డైనమిజాన్ని ప్రశంసించారు. శశిథరూర్ వ్యాసాన్ని ప్రధానమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది.

# దేశంలోనే బ్లాక్ బాక్స్ విశ్లేషణ

**విదేశాలకు పంపినట్లు పుకార్లు మాత్రమే**
**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టీకరణ**

పుణె,జూన్24: అహ్మదాబాద్ విమానప్రమాదం తరవాత విశ్లేషణ కోసం బ్లాక్ బాక్స్‌ను అమె రికా పంపినట్టు వస్తున్న ఊహాగానాలను కేంద్ర పౌరవిమా నయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మంగళవారంనాడు తోసిపుచ్చారు. 'అవన్నీ ఊహాగానాలే. బ్లాక్ బాక్స్ ఇండియాలోనే ఉంది. ప్రస్తుతం దీనిని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) పరిశీలిస్తోందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఎప్పటిలోగా బ్లాక్ బాక్స్‌లోని సమాచా రాన్ని వెలికితీసే అవకాశం ఉందని అడిగినప్పుడు, ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం ప్రక్రియను పరిశీలించనీ యండని అన్నారు. విమానం కూలిపోవడానికి ముందు ఏమి జరిగిందో లోతుగా తెలుసుకునేందుకు బ్లాక్ బాక్స్ డీకోడింగ్ జరుగుతోందని ఇంతకుముందు మంత్రి చెప్పారు.అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్ప కూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తును అధికారులు కొనసాగిస్తు న్నారు. ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఈ విమానంలో అసలేం జరిగిందో తెలుసుకోనేందుకు అందరి దృష్టి ఇప్పుడు 'బ్లాక్ బాక్స్' విశ్లేషణపై పడింది. ఈ నేపథ్యంలో బ్లాక్‌బాక్స్‌ను విచారణ కోసం విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. ఫిక్కీ, కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పుణెలో జరిగిన హెలికాప్టర్స్ అండ్



స్మాల్ ఎయిర్‌క్రాఫ్ట్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపిస్తున్నారా? అని విలేకర్లు అడగ్గా.. 'అవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్‌బాక్స్ భారత్‌లోనే ఉంది. దీన్ని ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పరిశీలిస్తోంది' అని స్పష్టం చేశారు. ఎప్పటివరకు దీంట్లోని డేటాను పొందొచ్చని మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఇది చాలా సాంకేతికతతో కూడిన వ్యవహారం. ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం ప్రక్రియను పరిశీలించనివ్వండి' అన్నారు. జూన్ 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటికే ఓ వైద్య కళాశాల వసతిగృహంపై కూలడం పెను విషాదం నింపింది. ఈ ఘటనలో 240 మంది ప్రయాణికులతో పాటు 270మంది ప్రాణాలు కోల్పోగా.. విమాన ప్రయాణికుల్లో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో జూన్ 13న ఎయిరిండియా బోయింగ్ 787 -8 డ్రీమ్‌లైనర్ విమానం బ్లాక్ బాక్స్‌ను అధికారులు ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ అనేది విమానంలో ఏం జరిగిందో అన్న సమాచారాన్ని రికార్డు చేసే ఓ చిన్న పరికరం. ఇది విమాన ప్రమాదాల దర్యాప్తులో దీన్ని డీకోడ్ చేయడం వల్ల విమాన ప్రమాదానికి కొన్ని క్షణాల ముందే ఏం జరిగిందో తెలుసుకొనేందుకు ఉపయోగపడుతుంది.

# రాజధాని అమరావతిలో మరో 44వేల ఎకరాల సేకరణ

**గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్.. విద్యా సంస్థలు.. ఆస్పత్రుల నిర్మాణం**
**భూమి ఇచ్చే వారికి మెరుగైన ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు**
**జీఏడీ టవర్.. హెచ్‌వోడీ టవర్.. నిర్మాణాలు**
**ఎన్సీసీ షాపూర్‌జీ పల్లంజీకి, ఎల్ అండ్ టీకి టెండర్ ఆర్డర్**
**అమరావతిలో స్టార్ హోటల్ నిర్మాణానికి ఆమోదం**
**స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు**
**పోలవరం ప్రాజెక్ట్ 2027లో పూర్తి అయ్యేలా చర్యలు**
**కేబినేట్‌లో పలు నిర్ణయాలు..వెల్లడించిన మంత్రి పార్థసారథి**



అమరావతి,జూన్24: రాజధాని రెండో విడత భూసేకరణను కేబినెట్ ఆమోదించింది. రాజధానిలో మరో 44వేల ఎకరాల సేకరణకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయడానికి ఓకే చెప్పింది. టెన్నిస్ ప్లేయర్ సాకేత్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.. కీలక నిర్ణయాలకు ఆమోముద్ర వేశారు.. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత.. మీడియాతో మాట్లాడిన మంత్రి కొలుసు పార్థసారథి.. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.. ఈ ఏడాదిలో 25 కేబినెట్ సమావేశాలు జరిగాయి.. కొన్ని వందల నిర్ణయాలు ఇప్పటి వరకు తీసుకున్నాం.. ఏపీ సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ప్రకారం మరో విడత భూ సమీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్.. విద్యా సంస్థలు.. ఆస్పత్రులు అందించే విధంగా భవిష్యత్ అవసరాల కోసం.. ల్యాండ్ పూలింగ్ జరుగుతుందన్నారు.. 2015లో కూడా 35 వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ జరిగింది.. అసైన్‌మెంట్, భూముల విషయంలో స్థానిక అధికారులతో విచారణ తర్వాత భూ సమీకరణ జరుగుతుందన్నారు. అన్ని నియమ నిబంధనలు ప్రకారం.. ఆధార్, పాస్‌పోర్ట్ వివరాల ఆధారంగా ల్యాండ్ పూలింగ్ జరుగుతుంది.. రైతులకు సంబంధించి ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చే వారికి మెరుగైన ప్యాకేజ్ అందిస్తున్నాం అన్నారు.. అమరావతిలో జీఏడీ టవర్.. హెచ్‌వోడీ టవర్.. ఎన్సీసీ షాపూర్‌జీ పల్లంజీకి, ఎల్ అండ్ టీకి టెండర్ ఆర్డర్ ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు..ఇక, మున్సిపల్ శాఖలో 40 టౌన్ ప్లానర్ పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. భవన నిర్మాణంలో ఉన్న సమస్యలకు పరిష్కారం కోసం మున్సిపల్ నిబంధనల సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్ కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గండికోట ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకునేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. కరోన వల్ల నిర్మాణ సంస్థల పనులు నిలిచి పోయాయి.. కరోన వల్ల వ్యాపారం దెబ్బ తిన్న కాంట్రాక్టర్లకు పనులకు సంబంధించిన టెండర్లలో ప్రాధాన్యత ఇచ్చేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు.. పోలవరం ప్రాజెక్ట్ 2027లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను సూచించారని తెలిపారు. . ఇక, బనకచర్ల ప్రాజెక్ట్ కు సంబంధించి చర్చ జరిగింది. రెండు రాష్ట్రాలకు నష్టం జరగకుండా వృథాగా పోయే నీటిని రెండు రాష్ట్రాల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని సీఎం ఆలోచన. ఎవరికి నష్టం చెయ్యాలని. హక్కులు తీసుకోవాలని ఆలోచన లేదని స్పష్టం చేశారు.. అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు సీఎం సూచన చేశారు.. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో సాంస్కృతిక శాఖకు బాధ్యతలు అప్పగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడొద్దు.. సీఎం ఆదేశం



హైదరాబాద్, జూన్ 24: గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ ఉప ఎన్నికలో గెలవాల్సిందే అని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందరినీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక.. అభ్యర్థి ఎంపికకు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది.

# సంపాదకీయం

బుధవారం 25-06-2025

## ఏళ్లలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి

ప్రధాని నరేంద్ర మోదీ 26 మే 2014న ప్రమాణ స్వీకారం చేసినప్పుడు చాలామంది ఆయనను రాజకీయ 'విఘాతకారి'గా చూశారు. పదకొండు సంవత్సరాల తరువాత ఆయన కొత్త భారతీయ ఏకాభిప్రాయానికి రూపశిల్పిగా నిలిచారంటే నిజమైన ప్రగతిశీలవాదులు ఒప్పుకొని తీరవలసిందే. ఆయన చూపించిన ప్రజాపాలనలోని నిర్ణయాత్మకత, పేదలకు గౌరవం, క్షమాపణ లేని జాతీయ వి శ్వాసం వంటి వాటివల్ల ఒకప్పటి అసాధ్యా లు ఇప్పటికి సుసాధ్యమవుతున్నాయని చెప్పాలి. ఈ పదకొండు సంవత్సరాలు కే వలం ఎన్నికల విజయాల చరిత్ర మాత్రమే కాదు ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, దౌ త్యం వంటి విషయాల్లో వ్యవస్థాగత పరివర్తనను ఒక అరుదైన రికార్డుగా ఒప్పుకోక తప్పదు. ఈ మోదీ యుగాన్ని విభిన్నంగా చేసేది సాధించిన దానిద్వారా మాత్రమే కాదు, అధిగమించిన సవాళ్ల స్వభావం ద్వారా కూడా విశ్లేషించవలసి ఉంటుంది. భారతదేశానికి వారసత్వంగా వచ్చిన ఆర్థిక గందరగోళం, లోతైన సంస్థాగత అపనమ్మకం, అంతర్గత తిరుగుబాట్లు, శత్రు సరిహద్దులు, ప్రపంచ మహమ్మారి, దేశంలోని వెలుపల శక్తివంతమైన వర్గాల నుంచి నిరంతర సైద్ధాంతిక ప్రతిఘటనల ను ఎదుర్కొంది. అయినప్పటికీ ప్రతి మలుపులోనూ, ఈ ప్రభుత్వం ఎగవేతతో కాదు స్పష్టత, దృఢ నిశ్చయంతో స్పందించింది. 2013లో భారతదేశం 'ఫ్రాజిల్ ఫై వ్' (టర్కీ, బ్రెజిల్, ఇండియా, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా) ఆర్థిక వ్యవస్థలలో ఒకటి గా ముద్ర సంపాదించుకున్నది. అప్పట్లో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండింది. పెట్టుబడి సెంటిమెంట్ తక్కువగా ఉండేది. ఒక రకంగా చెప్పాలంటే, నిర్ణయం తీసుకోవ డం దాదాపు స్తంభించి పోయిన పరిస్థితి అది. కానీ, నేడు భారతదేశం అత్యంత వే గంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిం ది. ప్రపంచ మందగమనాల మధ్య కూడా స్థిరమైన 7%+ వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. మన దేశం ఇప్పుడు ప్రపంచంలో ఐద వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 2027 నాటికి జపాన్, జర్మనీలనూ మరింతగా అధిగమించడానికీ సిద్ధంగా ఉంది. 2014 నుం చి జీడీపీ రెట్టింపు కంటే ఎక్కువైంది. విదేశీ నిల్వలు 650 బిలియన్ అమెరికన్ డాలర్ల ను దాటాయి. వ్యాపారం చేయడంలో సౌ లభ్యంలో భారతదేశం డజన్ల కొద్దీ ర్యాంకులకు ఎగబాకింది. తయారీ, మౌలిక సదు పాయాలలోకి భారీ మూలధనం ప్రవహించింది. 11ఒకప్పుడు చెదిరిపోయిన పెట్టు బడి ఇంజిన్ మళ్ళీ సజీవంగా ఉంది. ఎం దుకంటే, ప్రజలతోపాటు మార్కెట్‌లోనూ విశ్వాసం పునరుద్ధరణకు నోచుకుంది. ఈ వృద్ధి స్వయంచాలకంగా జరగలేదు. ఇది ఒక రకంగా కఠినమైన, తరచుగా రాజకీయంగా సాహసోపేత నిర్ణయాల ద్వారానే సాధ్యమైనట్టుగా చెప్పాలి. వాటిలో నోట్ల రద్దు, జీఎస్‌టీ, దివాలా, దివాలా స్మృతి (ఇన్సాల్వెన్సీ, బాంక్రప్ట్సీ కోడ్) బ్యాంకింగ్ రంగాన్ని శుభ్ర పరచడం వంటివి ప్రధా నం. వీటి తర్వాత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే దేశం ముందడుగు వేసింది. ఉత్పత్తి లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకాలు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండి యా -వంటివి నిర్మాణరంగాన్ని గణనీయ స్థాయిలో వృద్ధిలోకి తీసుకువచ్చాయి. భారతదేశం ఇప్పుడు తన సొంత స్మార్ట్‌ఫోన్‌లను ఉత్పత్తి చేస్తోంది. రక్షణ పరికరా లను ఎగుమతి చేస్తోంది. సెమీకండక్టర్ ప్లాంట్లను ఆకర్షిస్తోంది. యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులలో ప్రపంచంలోనే ఉన్నత స్థితికి చేరుకుంది. ఇది ఇకపై వినియోగ ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాదు, బిల్డ ర్ల ఆర్థిక వ్యవస్థగానూ మారుతున్నది. మో దీ పాలనా నమూనా పాత టాప్-డౌన్ పోషక వ్యవస్థను తిరస్కరించింది. బదులుగా, ఇది సంతృప్త డెలివరీ విషయంలో పందెం కాసిందనే చెప్పాలి. ఫలితాలు భారత చరిత్రలో అపూర్వమైనవిగా విశ్లేషకుల ప్రశం సలు పొందాయి. జల్ జీవన్ మిషన్ కింద రూ.12 కోట్ల కు పైగా కుళాయి కనెక్షన్లు దేశప్రజలకు అందాయి. స్వచ్ఛ భారత్ కింద రూ.11 కో ట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మితమైనాయి. ఉజ్వల కింద రూ.9 కోట్లకు పైగా గృహాల వారు ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లతో ప్రయోజనం పొందారు. పీఎం ఆవాస్ యోజన కింద రూ.3 కోట్లకు పైగా ఇళ్లు మంజూరైనాయి. ఆయుష్మాన్ భారత్ కింద రూ. యాభై కోట్ల మంది భారతీయులు లబ్ధి పొందారు. కొవిడ్ మహమ్మారి సమయంలోనూ 'పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న' యోజ న కింద 80 కోట్లమంది ఉచిత రేషన్ పొందారు. ఇవన్నీ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పంపిణీ అయ్యాయి. ఆధార్, మొబైల్ కనెక్టివిటీ వెన్నెముకగా ఆయా పథకాలలో అవాంఛనీయ మధ్యవర్తులకు అవకాశం లేకుండా పోయింది. సంక్షేమం అన్నది ఒక హక్కు ఆధారితంగా మారింది. అంత్యోదయ యోజన ప్రధాన భూమికగా- ఏ భారతీయుడు కూడా అభివృద్ధిలో వెనుకబడి ఉండకూడదన్నది ము ఖ్య లక్ష్యంగా నిలబడింది. పేదరికం, నిర్లక్ష్యం సాధారణీకృతమైన భారతదేశంలో నిజంగానే వీటన్నింటినీ ఒక నాగరిక దిద్దుబాటు చర్యలుగా అభివర్ణించ వలసిందే. దశాబ్దాలుగా ఆర్టికల్ 370 రద్దును చా లా సున్నితమైందిగానే కాక చాలా ప్రమాదకరమైంది గానూ పలువురు భావించా రు. కానీ, 2019 ఆగస్టు 5న ఆ సమీకరణం శాశ్వతంగా మారిపోయింది. జమ్మూ కశ్మీ ర్ ప్రత్యేక హోదాను శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా, చాలామంది హెచ్చరించిన హింసాత్మక తిరుగుబాటును ప్రేరే పించకుండా తొలగించడంలో మోదీ ప్ర భుత్వం విజయం సాధించింది. ఐదు సం వత్సరాల తర్వాత కశ్మీర్ విలీనం పూర్తయింది. పర్యాటకుల రాక రికార్డులను బద్దలు కొట్టిందనే చెప్పాలి. పెట్టుబడులు ప్రా రంభమయ్యాయి. కానీ, దీన్నంతా చూడలేని ఉగ్రవాదుల కళ్లు మండాయి. పహల్గాం హింసాకాండతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినంత పనైంది. 'కశ్మీర్ పర్యాట కంగా మళ్లీ ఎప్పటికి కోలుకోవడ మో కదా' అన్న భయాందోళనలను దూరం చే సే దిశగా సర్కారు పలు ప్రయత్నాలలో నిమగ్నమైంది.

# ఫోన్ ట్యాపింగ్ గుట్టు విప్పేసారా...

హైదరాబాద్, జూన్ 24, తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుల వాంగ్మూలాలు దర్యాప్తును మరింత ఆసక్తికరంగా మార్చాయి. తాజాగా విచారణలో ప్రణీత్‌రావు అసలు గుట్టు విప్పారు. ప్రణీత్ రావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, 2018 నుంచే తెలంగాణలో రాజకీయ నాయకులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల ఫోన్లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు వెల్లడైంది. నాలుగేళ్ల కాలంలో వేల సంఖ్యలో ఫోన్లు ట్యాప్ చేయబడ్డాయి. ఇది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నిఘా కార్యకలాపాల తీవ్రతను సూచిస్తుంది. ఈ విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది, ఎందుకంటే ఇది గోప్యతా హక్కుల ఉల్లంఘనతో పాటు, రాజకీయ దురుద్దేశాలను సూచిస్తుంది. ప్రణీత్ రావు వెల్లడించిన మరో కీలక అంశం ఏమిటంటే, ట్యాప్ చేసిన ఫోన్ సంభాషణల డేటాను పెన్ డ్రైవ్‌లో కాపీ చేసి ప్రభాకర్ రావుకు అందించినట్లు తెలిపాడు. ఈ డేటా ఎవరికి చేరిందనే విషయంపై ప్రణీత్ రావు తనకు తెలియదని చెప్పడం దర్యాప్తులో కొత్త సందిగ్ధతను సృష్టించింది.



ఈ పెన్ డ్రైవ్ ఎవరి చేతుల్లోకి వెళ్లింది, దాని ద్వారా ఎలాంటి సమాచారం ఉపయోగించబడింది అనే ప్రశ్నలు ఇప్పుడు సిట్ దర్యాప్తు దృష్టిలో కీలకంగా మారాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రణీత్ రావు మరియు ప్రభాకర్ రావులను విడివిగా విచారిస్తోంది. ప్రణీత్ రావు తన చర్యలన్నీ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగాయని చెబుతుండగా, ప్రభాకర్ రావు తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, అన్నీ అప్పటి డీజీపీ సూచనల మేరకే జరిగాయని వాదిస్తున్నాడు. ఈ విరుద్ధమైన వాంగ్మూలాలు దర్యాప్తును మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. సిట్ ఇప్పుడు ఈ డేటా బదిలీ గొలుసు ఎక్కడిదాకా వెళ్లిందనే దానిపై దృష్టి సారించింది. ఈ కేసు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చను రేపుతోంది. కొందరు రాజకీయ నాయకులు, ముఖ్యంగా బీజేపీ నేత బండి సంజయ్, ఈ ట్యాపింగ్ వ్యవహారం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు. అయితే, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఈ ఆరోపణలను రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తూ, దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ ఒత్తిళ్లు సిట్ దర్యాప్తును మరింత సవాలుగా మార్చాయి. సిట్ దర్యాప్తు ఇప్పుడు పెన్ డ్రైవ్ గమనాన్ని గుర్తించడంపై కేంద్రీకరించింది. ఈ డేటా ఎవరి చేతుల్లోకి వెళ్లింది, దానిని ఎలా ఉపయోగించారు అనే విషయాలు ఈ కేసు యొక్క తదుపరి దశను నిర్ణయిస్తాయి. అదనంగా, రివ్యూ కమిటీ నుంచి అనుమతులు ఎలా పొందారు, మావోయిస్టు ముసుగులో ఎలా ట్యాపింగ్ జరిగింది అనే అంశాలపై కూడా సిట్ ఆరా తీస్తోంది. ఈ కేసు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు లేదా రాజకీయ నాయకుల వరకు చేరే అవకాశం ఉంది, ఇది రాజకీయ రంగంలో మరింత గందరగోళాన్ని సృష్టించవచ్చు.

# నీరసపడిన అధికార పార్టీ సోషల్ మీడియా

హైదరాబాద్, జూన్ 24, 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికలు అత్యంత చురుకుగా, ఉత్సాహభరితంగా కనిపించాయి. ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ యుగంలో పార్టీల గెలుపు ఓటములు, పథకాల అమలు, ఇతర అంశాలన్నీ సోషల్ మీడియా ద్వారానే ప్రజలకు చేరుతున్నాయి. దీంతో నేతల పనితీరుకు సోషల్ మీడియా కొలమానంగా మారింది. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపు, బీఆర్‌ఎస్ ఓటమికి సోషల్ మీడియా కీలక పాత్ర పోసించింది. అయితే ఇప్పుడు అధికార కాంగ్రెస్ సోషల్ మీడియా బలహీనపడింది. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికలు అత్యంత చురుకుగా, ఉత్సాహభరితంగా కనిపించాయి. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో, కాంగ్రెస్ సోషల్ మీడియా బృందాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు, ప్రజల సమస్యలను హైలైట్ చేయడం, పార్టీ హామీలను ప్రచారం చేయడంలో నిరంతరం కృషి చేశాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, సోషల్ మీడియా వారియర్స్ నిమిషం నిమిషం కొత్త వ్యూహాలతో ప్రత్యర్థి భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పై దాడి చేశారు. ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్), ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో వీడియోలు, మీమ్స్, గ్రాఫిక్స్, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పరచుకున్నారు. ఈ కాలంలో, సోషల్ మీడియా యాక్టివిస్టులు పార్టీ కోసం అహర్నిశలు పనిచేసి, ఎన్నికల విజయంలో కీలక పాత్ర పోషించారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, సోషల్ మీడియా వేదికల ఉత్సాహంలో మార్పు కనిపిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత, సోషల్ మీడియా ద్వారా ప్రజలతో సంబంధం కొనసాగించడంలో కొంత నీరసం కనిపిస్తోంది. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉండగా చూపిన చొరవ, ప్రభుత్వంలోకి వచ్చాక కొంత తగ్గినట్లు ఎక్స్‌లో కొన్ని పోస్టులు సూచిస్తున్నాయి. ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంలో సోషల్ మీడియా బృందాలు కొంత వెనుకబడినట్లు విమర్శలు వస్తున్నాయి. బీఆర్‌ఎస్, బీజేపీ వంటి ప్రత్యర్థులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండగా, కాంగ్రెస్ ఈ విషయంలో వ్యూహాత్మకంగా స్పందించడంలో వెనుకబడినట్లు కనిపిస్తోంది. ఎన్నికల విజయంలో సోషల్ మీడియా వారియర్స్ శ్రమ అపారమైనది. వీరు గ్రామీణ స్థాయి నుంచి నగరాల వరకు పార్టీ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటుతున్నా,

ఈ కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవులు లభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిద్రాహారాలు మాని పనిచేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కృషిని పార్టీ నాయకత్వం గుర్తించడం లేదనే ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పార్టీలో అంతర్గత అసంతృప్తిని పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా వ్యూహం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే భిన్నంగా ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కీలకం. ఉదాహరణకు, ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయవచ్చు. అయితే, ప్రస్తుతం ఈ దిశలో చురుకైన ప్రయత్నాలు కొరవడినట్లు కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్‌పర్సన్ సుప్రియా శ్రీనాటే నాయకత్వంలో ప్లాట్‌ఫారమ్‌లు బలోపేతమైనప్పటికీ, రాష్ట్ర స్థాయిలో ఇదే స్థాయి చురుకుదనం కనిపించడం లేదుసోషల్ మీడియా కార్యకర్తలకు పదవులు, గుర్తింపు ఇవ్వడం కేవలం వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే కాదు, పార్టీని బలోపేతం చేయడానికి కూడా అవసరం. ఈ కార్యకర్తలు గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు పార్టీ సందేశాన్ని అందించగల సామర్థ్యం కలిగి ఉన్నారు. వీరికి తగిన ప్రోత్సాహం, బాధ్యతలు అప్పగించడం ద్వారా సోషల్ మీడియా బందాలు మరింత ఉత్సాహంగా పనిచేస్తాయి. సోషల్ మీడియా కమిటీలలో బాధ్యతలు ఇస్తే, ఇది ఇతర కార్యకర్తలకు స్ఫూర్తిగా ఉంటుంది. గుర్తింపు లేని కార్యకర్తలలో నిరాశ పెరిగితే, భవిష్యత్ ఎన్నికలలో సోషల్ మీడియా శక్తి బలహీనపడే ప్రమాదం ఉంది.

భవిష్యత్ వ్యూహం..

తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా బృందాలు భవిష్యత్తులో మరింత చురుకుగా మారాలంటే, కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ విజయాల ప్రచారం: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఆకర్షణీయమైన వీడియోలు, గ్రాఫిక్స్ ద్వారా ప్రజలకు చేరవేయాలి.

కార్యకర్తల ప్రోత్సాహం: సోషల్ మీడియా కార్యకర్తలకు రాష్ట్ర స్థాయిలో కమిటీలలో బాధ్యతలు, గుర్తింపు ఇవ్వడం ద్వారా వారి ఉత్సాహాన్ని పెంచాలి.

ప్రత్యర్థులకు సమాధానం: బీఆర్‌ఎస్, బీజేపీ సోషల్ మీడియా దాడులకు వాస్తవాలతో, వ్యూహాత్మకంగా స్పందించాలి.

స్థానిక సమస్యలపై దృష్టి: గ్రామీణ స్థాయిలో ప్రజల సమస్యలను సోషల్ మీడియా ద్వారా హైలైట్ చేసి, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రచారం చేయాలి.

ఎన్నికల ముందు ఎట్ల ఉండే కాంగ్రెస్ సోషల్ మీడియా ఎన్నికల తరువాత ఎట్లా ఉంది కాంగ్రెస్ సోషల్ మీడియా .

# నెల తర్వాతే నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 24, : తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఈ అంశంపై కోర్టులో జరిగిన వాదనల్లో తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు మరో అరవై రోజుల సమయం కావాలని కోరింది. వాదనల్లో ప్రభుత్వం ఎన్ని రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలని ధర్మాసనం ప్రశ్నించింది. దానికి అరవై రోజుల గడువు కోరింది. గతంలో జరిగిన విచారణల్లో గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఎందుకు నిర్వహించలేదని హైకోర్టు ప్రశ్నించింది. వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తెలంగాణలో జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఎన్నికల్లో జాప్యంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. గతంలోనే విచారణ జరిగింది. జనవరి 30, 2025న జరిగిన విచారణలో, హైకోర్టు బెంచ్ పంచాయతీ రాజ్ శాఖను మూడు వారాలలో సమాధానం దాఖలు చేయాలని ఆదేశించింది. కొంత జాప్యం తర్వాత ఇప్పుడు మళ్లీ విచారణకు వచ్చింది. గత విచారణలో ప్రభుత్వం ఫిబ్రవరిలోపు ఎన్నికుల నిర్వహిస్తామని చెప్పింది. కానీ ఫిబ్రవరి ముగిసిపోయి మరో నాలుగు నెలలు గడిచిపోయినా ఎన్నికలు నిరవహించలేదు. ఇప్పుడు మరో అరవై రోజుల సమయం కావాలని ఎన్నికల కమిషన్ హైకోర్టుకు తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇది గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను దెబ్బతీస్తోందని పిటిషనర్ విచారణలో వాదించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సంవత్సరాలుగా నిర్వహించకపోవడం వల్ల సంబంధిత గ్రామాలకు సంక్షేమ కార్యకలాపాలు అందకుండా పోయాయని పిల్‌లో వాదించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటి పోవడంతో పాటు అన్ని స్థానిక సంస్థలకు సంబందించిన పాలక వర్గాల గడువు ముగిసింది. అన్ని పాలక వర్గాలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. పంచాయతీల పదవీ కాలం 2024 జనవరి 31వ తేదీన, జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జులైలో ముగిసింది. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఎన్నికలు ఇంకా ఆలస్యం అయితే ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ. 1,500 కోట్లు నష్టం జరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. మరో వైపు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ నుంచి కూడా ఎన్నికలు నిర్వహించాలన్న ఒత్తిడి వస్తోంది. స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశంతోనే.. వెంటనే ప్రభుత్వం రైతు భరోసాని అమలు చేసిందని చెబుతున్నారు. ఈసారి తైరు భరోసాని రైతులందరి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు మరో రెండు నెలల గడువు కావాలని హైకోర్టును కోరడంతో.. స్థానిక ఎన్నికలు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొంత మంది మంత్రులు.. వచ్చే పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్నట్లుగా మాట్లాడటం కూడా వివాదాస్పదం అయింది.

# మరో కొత్తరెండు మున్సిపాల్టీలు

హైదరాబాద్, జూన్ 24, ష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపాలిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారం గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిన్నారం, ఇంద్రేశం ప్రాంతాలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా పెరుగుదల, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల నేపథ్యంలో ఈ డిమాండ్ తెరపైకి వచ్చిందిఈ రెండు గ్రామాలు పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. పటాన్ చెరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉండటం వల్ల జనాభా పెరుగుదల అధికంగా ఉంది. దీంతో ప్రాథమిక సదుపాయాలు, పట్టణీకరణ అవసరాలు పెరిగాయి. ఈ ప్రాంతాలు హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉండటం, ఇక్కడ పెద్ద ఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు సాగడం, రియల్ ఎస్టేట్ రంగంలో గణనీయమైన వృద్ధి కనిపించడంతో, పట్టణ అవసరాలు గ్రామ పంచాయతీల పరిధిలో తీర్చడం కష్టతరంగా మారింది. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచడానికి మున్సిపల్ హోదా అవశ్యకతను స్థానిక ప్రజలు, నాయకులు తెరపైకి తీసుకొచ్చారు. మున్సిపాలిటీలుగా మారితే నిధుల కేటాయింపులు పెరుగుతాయని.. తద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ వంటి సమీప గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారినందున జిన్నారం, ఇంద్రేశం కూడా మున్సిపాలిటీలుగా మారాలని డిమాండ్ బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలోనే జిన్నారం, ఇంద్రేశం గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని కూడా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.

# హౌజింగ్ బోర్డు స్థలాలకు రికార్డ్ వేలం

హైదరాబాద్, జూన్ 24, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక కమర్షియల్ ప్లాట్‌ను ఏకంగా రూ.33 కోట్లకు కొనుగోలు చేయడానికి ముందుకు రాగా, మరో చోట రూ. 13.51 కోట్లు పలికింది. రెండు ఎంఐజి ప్లాట్లను కూడా సుమారు 4.50 కోట్లకు పైగా వెచ్చించి బహిరంగ వేలంలో దక్కించుకోడానికి పోటీపడ్డారు. అలాగే చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. మొత్తం 11 ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌజింగ్ కమిషనర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. నగరంలోని చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్లాట్లకు సోమవారం నాడు హౌజింగ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు, గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లు వీటిలో ఉన్నాయి. కూకట్‌పల్లి కెపీహెచ్‌బీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వించిన ఈ స్థలాల వేలం పాటలో 55 మంది పాల్గొన్నారని హౌజింగ్ కమిషనర్ పేర్కొన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్లు బోర్డుకు ఆదాయంగా వచ్చింది. గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ ల్యాండ్ ను గజానికి రూ.2.22 లక్షలు చొప్పున సుమారు రూ. 33 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ భూములకు చదరపు గజానికి 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ధారించగా వేలం పాటలో అది 2.22 లక్షలు పలికింది. అట్లాగే ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాల భూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఆ భూములకు రూ 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. ఇక్కడి రెండు ఎంఐజి ప్లాట్లు చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ. 1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే 55 కోట్ల 56 లక్షల 84 వేల మేర ఆదాయం హౌజింగ్ బోర్డుకు సమకూరింది. కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజీ ప్లాట్లు కూడా అత్యధిక ధరలతో బహిరంగ వేలంలో అమ్ముడు పోయాయి. ఈ ప్రాంతంలో మొత్తం పది ప్లాట్లను వేలం వేయగా వీటిలో ప్లాట్ నెం.113,114,115ల ద్వారానే సుమారు 8.11 కోట్ల మేర ఆదాయం వచ్చింది. నిజాంపేట-బాచుపల్లిలోని నాలుగు ప్లాట్లను సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.

# మూలపాడు వద్ద అమరావతి గేట్ వే

విజయవాడ, జూన్ 24,ఇప్పటి వరకు ఎన్నో గేట్ వేలు చూసి ఉంటారు. కానీ ఇక్కడ నిర్మిస్తున్న గేట్ వే గురించి తెలుసుకుంటే, ఔరా అనేస్తారు. అందుకు వేదికగా మారింది ఏపీ రాజధాని అమరావతి. ఇప్పటికే ఎన్నో రికార్డులను దక్కించుకున్న అమరావతి అమ్ముల పొదిలో మరో రికార్డు చేరువ కానుంది. ఇంతకు ఆ రికార్డు ఏమిటి? అసలు గేట్ వే వింతలు విశేషాలు ఏమిటో తెలుసుకుందాం. అమరావతి ఇది కేవలం ఒక పేరు కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని. కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న మౌన చలనాలకి ఇప్పుడు కొత్త ఊపొస్తుందనిపిస్తోంది. మళ్లీ ఓ దిశగా అమరావతి వైపు అధికారులు, ఇంజినీర్లు కదులుతున్నట్టుంది. అయితే ఈసారి దృష్టి కేంద్రంలో ఉన్నది ఒక ప్రత్యేక ప్రాంతం. అక్కడే రాజధానికి ప్రధాన ద్వారం ఏర్పడబోతోందన్న వార్తలు అధికార వర్గాల్లో హల్‌చల్ సృష్టిస్తున్నాయి. ఈ బ్రిడ్జి ఎక్కడా.. చూసి ఉండరేమో! ఇప్పటికే విజయవాడ ? హైదరాబాద్ జాతీయ రహదారి వెంబడి మూలపాడు వద్ద ఒక ప్రతిష్ఠాత్మకమైన బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ బ్రిడ్జి కేవలం ఓ ట్రాన్స్‌పోర్ట్ కనెక్టివిటీ గానే కాకుండా, అమరావతి నగరానికి ఒక గుర్తింపు చిహ్నంగా మారే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మూలపాడు ప్రాంతాన్ని అమరావతికి ప్రధాన ప్రవేశ ద్వారంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో భూకణాలను పరీక్షించేందుకు అక్కడ మట్టి నమూనాల పరీక్షలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ భూసామర్థ్య పరీక్షలు విజయవాడ ? హైదరాబాద్ జాతీయ రహదారి పై అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఇది కేవలం ఒక సాధారణ పరీక్ష ప్రక్రియ కాదు.. ఇది రాజధాని యొక్క భవిష్యత్ ప్రవేశద్వారానికి వేసే మొదటి అడుగు అని చెప్పవచ్చు. మూలపాడు ప్రాంతం రాజధానికి దగ్గరగా ఉండడమే కాకుండా, రవాణా దృష్టికోణంలోనూ అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. అందువల్లే అధికార యంత్రాంగం ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తూ, అక్కడే ఐకానిక్ బ్రిడ్జితో కూడిన గేట్‌వే అభివృద్ధికి పునాదులు వేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వ స్థాయిలో ఆమోదం లభిస్తే, మూలపాడు ప్రాంతం అమరావతి నగరానికి ప్రధాన ఎంట్రీ పాయింట్‌గా మారనుంది. దీంతో ఆ ప్రాంత అభివృద్ధి వేగంగా పెరిగే అవకాశముంది. ఒకవేళ మూలపాడు ద్వారా రాజధాని అభివృద్ధికి తొలి అడుగు పడితే, అక్కడి స్థానికులకు, వ్యాపారికులకు, రవాణా రంగానికి ఎంతో లాభం చేకూరుతుంది. అంతేగాకుండా, విమానాశ్రయాల నుంచి వచ్చే ప్రయాణికులు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ప్రముఖులకూ ఇదే ప్రధాన మార్గంగా నిలవనుంది! ఇకపోతే, మూలపాడు బ్రిడ్జి ప్రాజెక్టు ప్రత్యేకత ఏంటంటే, ఇది కేవలం వాహనాల రాకపోకలకే కాదు, నగర ముఖచిత్రాన్ని ప్రతిబింబించేలా ఒక ఐకానిక్ ఆర్కిటెక్చర్‌గానూ నిర్మించనున్నారు. శిల్పకళ, ఆధునిక నిర్మాణ శైలి కలబోతగా ఇది ఉండనుంది. ఒక నగరాన్ని గుర్తించే ప్రధాన ద్వారం ఎలానీ ఉండాలో దానికి ఇది ఒక ప్రేరణగా నిలవబోతోంది. విదేశీ మోడళ్లను పరిశీలించి, ఉత్తమ డిజైన్‌ను ఎంచుకునేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదొక అద్భుతం.. ఇక మొట్టమొదటగా మూలపాడును ఎంపిక చేయడానికి మరో కారణం.. ఇది విజయవాడకు అత్యంత సమీపంగా ఉంది. విజయవాడ మెట్రో రైలు, రింగ్ రోడ్ల ప్రాజెక్టులతో కలిపి అమరావతికి తీసుకెళ్లే ప్రధాన రహదారిగా దీన్ని అభివృద్ధి చేయవచ్చు. దీంతో పర్యాటక రంగం, వాణిజ్య కార్యకలాపాలు మరియు ఆస్తి విలువలు అన్నీ పెరిగే అవకాశముంది. మూలపాడు పేరే వచ్చే రోజుల్లో హాట్ లొకేషన్‌గా మారిపోవచ్చని అంటున్నారు రియల్ ఎస్టేట్ వర్గాలు కూడా. ఇప్పటికే రాజధాని నిర్మాణం విషయంలో ప్రభుత్వం సరికొత్త చర్యలు చేపడుతుండగా, వాస్తవిక దిశగా ముందడుగులు పడుతున్నాయి. అలా ముందుగా ప్రారంభించబోయే ప్రధాన అడుగు.. గేట్‌వే టు అమరావతి అనేది మూలపాడులో ఉండబోతుందన్న సంకేతాలు ఇప్పుడు అధికార వర్గాల్లో స్పష్టంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మట్టినమూనాల పరీక్షలు ఆ ప్రాంత భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లుగా భావించవచ్చు. మొత్తంగా చూస్తే, మూలపాడు ప్రాంతం ఒక సాధారణ గ్రామం నుండి రాజధానికి ముఖద్వారంగా అభివృద్ధి చెందబోతుంది. అక్కడ ప్రారంభించబోయే బ్రిడ్జి కేవలం కాంక్రీటు నిర్మాణం కాదు.. అది అక్షరాలా అమరావతికి తలుపుగా నిలవనుంది. ఇది రాజధాని నగరంలో అధికారిక అభివృద్ధి ప్రారంభమవుతోందని సంకేతమిచ్చే తొలి నిర్మాణం కావడం విశేషం. ఇక అమరావతికి మార్గం ఖరారవుతోంది, కదలిక మొదలైంది

## వెలుగులోకి నిత్య పెళ్లి కూతురు కతలు

ఏలూరు, జూన్ 24 పెళ్లయి విడాకులు తీసుకున్నారా.. లేదా వివాహం కాలేదన్న డిప్రెషన్లో ఉన్నారా.. అయితే మీకు ఫోన్ ద్వారా కానీ, ఎవరైనా పెళ్లిళ్ల బ్రోకర్ల ద్వారా కానీ మీకు చక్కని అమ్మాయి ఉంది.. చాలా మంచిది.. చాలా అందంగా ఉంటుంది.. అంటూ చెబితే మీరు అమ్మాయి ఫోటోచూసి ఉబ్బితబ్బిబ్బయ్యి పోకండి.. ఇలా చాలా మందే ఇలా మోసపోయారు.. ఈ విషయం ఎవరో చెబితే పెద్ద విషయం కాదు కానీ స్వయంగా మోసపోయిన బాధితులే బాబోయ్ ఈ నిత్య పెళ్లి కూతురు వలలో పడి మోసపోయామని ఏకంగా జిల్లా ఎస్పీకే ఫిర్యాదు చేశారు.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కు నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరు పట్టణాలకు చెందిన ముగ్గురు బాధితులు జిల్లా ఎస్పీ కృష్ణారావును కలిసి ఫిర్యాదు చేశారు. తమలాగ మరి ఎవరూ మోసపోకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసామన్నారు. నిత్య పెళ్లికూతురు కాజేసిన సొమ్మును తిరిగి తమకు ఇప్పించాలని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన బేతి వీర దుర్గ నీలిమ, ఆమె తల్లి బేతి వీరలక్ష్మి, రామకృష్ణ, కళ్యాణ్ లు ఆర్థిక స్థిరత్వం కలిగి విడాకులు తీసుకున్న పురుషులను టార్గెట్ గా చేసుకుని మోసం చేస్తున్నారని ఇటీవలే పశ్చిమ గోదావరి జిల్లాలో కేసు నమోదయ్యింది.. అయితే ఈ కేసు విషయంలో న్యాయం కోరుతూ నిత్య పెళ్లికూతురిపై అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణరావుకు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారుతమ లాంటి వారిని మోసం చేసి 12 పెళ్లిళు చేసుకుందని, ఆ తరువాత తమ వద్ద మొత్తం డబ్బు,బంగారం లాగేసి ఆపై సెక్షన్ 498 కేసులు పెట్టి వేధిస్తోందని వారంతా జిల్లా ఎస్పీ వద్ద వాపోయారు.. ఈ నిత్య పెళ్లికూతురు వలలో పడి మోసపోయిన తమకు న్యాయం చేయాలని వారు ఎస్పీకు విజ్ఞప్తి చేశారు..వైవాహిక జీవితంలో మనస్పర్థలు వచ్చో లేక మరే కారణం చేతనైనా విడిపోతే వారిలో చాలా మంది డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి మానసికంగా ఇబ్బందులు పడుతుంటారు.. సరిగ్గా ఈ నిత్య పెళ్లికూతురుకు వీళ్లే టార్గెట్‌గా మారుతున్నారని బాధితులు వాపోయారు. విడాకులు తీసుకుని డిప్రెషన్ లో ఉన్న పురుషులకు మాయ మాటలు చెప్పి వివాహం వరకు తీసుకువెళతారని, ఈ లోపు వారి నుండి అందినకాడికి డబ్బును దోచుకుని, బాధితులు తిరగబడితే తప్పుడు కేసులు పెట్టి వేధించేవారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 12 మంది పురుషులను మోసం చేసి లక్షల్లో డబ్బులు వసూలు చేసుకుని పరారయ్యారని బాధితులు గొల్లు మన్నారు.. ఇటీవల నిత్య పెళ్ళి కూతురు బేతి వీర దుర్గా నీలిమపై కేసులు నమోదు కావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. సోమవారం నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరు పట్టణాలకు చెందిన ముగ్గురు బాధితులు జిల్లా ఎస్పీ కృష్ణారావును కలిసి ఫిర్యాదు చేశారు. తమలాగ మరి ఎవరూ మోసపోకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసామన్నారు. నిత్య పెళ్లికూతురు కాజేసిన సొమ్మును తిరిగి తమకు ఇప్పించాలని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బయటకు వచ్చని వారు చాలా తక్కువేనని, పరువు కోసం చాలా మంది బయటకు రాకపోవడంతో నిత్యపెళ్లికూతురు, ఆమె కుటుంబం ఇదే పనిగా పెట్టుకుని ఎంతో మంది జీవితాలతో ఆడుకుంటున్నారని వారు వాపోయారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

అనకాపల్లి,అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.వైజాగ్ నుండి అనకాపల్లి వెళ్తున్న లారీ ఒక కారును బలంగా ఢీ కొట్టింది. కారులో నలుగు రు వ్యక్తులు ఉండగా అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు.లారీ బ్రేకులు ఫెయి ల్ కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలు స్తోంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

## చెంగల్ పట్టు ఎక్స్ ప్రెస్ లో దోపిడి దొంగల హల్ చల్

అనంతపురం అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి వద్ద రైలులో దోపిడీ జరిగింది. ముంబయి నుంచి చెన్నై వెళ్తున్న చెంగల్ పట్టు ఎక్స్ప్రెస్ లో దోపిడీ దొంగలు హల్ చల్ చేసారు. ఎస్1, ఎస్2 బోగీల్లో ప్రయాణికుల నుంచి దోచుకున్నారు. కోమలి వద్ద సిగ్నల్ వైర్లు కత్తిరించడంతో ఎక్స్ ప్రెస్ రైలు నిలిచింది. సిగ్నల్ చూపకపోవడంతో నిలిచిన రైలు బోగీల్లోకి దొంగలు చొరబడిన ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిరు. అందినకాడికి దోచుకున్నారు.


# వైసీపీకి కలిసి రాని కాలం

గుంటూరు, జూన్ 24, వైసీపీలో నేతలు ఎందుకు భయపడుతున్నారు? పల్నాడు టూర్ వ్యవహారం అధినేతతోపాటు కేడర్‌కు చిక్కులు తెచ్చిపెట్టిందా? ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు కీలక నేతలు ముఖం చాటేస్తున్నారా? పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని కేడర్ ఆలోచన చేస్తోందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. అధినేత అనేవారు జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఆవేశంతో నిర్ణయాలు తీసుకుంటే నేతలేకాదు.. చివరకు కేడర్ సైతం దూరం అవుతుంది. వైసీపీకి ఇప్పుడు అలాంటి పరిస్థితి ఎదురైంది. పల్నాడు టూర్ వ్యవహారంలో కీలక నేతలపై గుంటూరు జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ టూర్‌లో జగన్ ప్రయాణిస్తున్న వాహనం కిందపడి ఓ వ్యక్తి చనిపోవడంతో కలకలం రేపింది. దీనికి సంబంధించి సాక్ష్యాలు బయటపెట్టి కేసు నమోదు చేశారు పోలీసులు. ఏ1 రమణారెడ్డి కాగా, ఏ2గా జగన్ పేరు ప్రస్తావించారు. హత్య కిందకు రాని కల్పబుల్ హోమీ సైడ్ సెక్షన్ కింద కేసు రిజిస్టర్ అయ్యింది. అంటే ఒక వ్యక్తికి చావుకు కారణమైనప్పుడు ఆ తరహా సెక్షన్ ఉపయోగిస్తారు. ప్రస్తుతం పల్నాడు పోలీసులు అదే చేశారు. ఈ కేసు నమోదు చేయడానికి ముందు ఆ సెక్షన్‌పై కూలంకుషంగా చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకున్నారు. నిర్లక్ష్యంతో చావుకు కారణమని భావించి బీఎన్ఎస్ 106(1)) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు పోలీసులు. దర్యాప్తులో దొరికిన ఫుటేజీలు ఆధారంగా కల్పబుల్ హోమిసైడేనని నిర్ధారణకు వచ్చారు అధికారులు. చివరకు ఈ సెక్షన్ జత చేశారు.జగన్ సహా మిగతా నిందితులపై ఈ సెక్షన్ పెట్టారు పోలీసుల. నేరం నిరూపణ అయితే ఈ సెక్షన్ కింద జీవిత ఖైదు విధించే అవకాశముందని కొందరు అడ్వకేట్లు చెబుతున్నమాట. నేర తీవ్రతను బట్టి జైలు శిక్ష, జరిమానా రెండూ విధించేందుకు అవకాశముందని అంటున్నారు. ఈ సెక్షన్ పూర్తిగా నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ అని అంటున్నారు. నేరానికి ప్రేరేపించారనే అభియోగంపై బీఎన్ఎస్ 49 సెక్షన్‌ను ఈ కేసులో చేర్చినట్టు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఫుటేజ్ ఉండడంతో అధినేత జగన్‌కు కష్టాలు తప్పవని అంటున్నారు నేతలు, కేడర్. కేసు వేగంగా దర్యాప్తు న్యాయస్థానం ముందుకు వస్తే జగన్‌కు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. మరోవైపు సాక్షి టీవీ డిబేట్‌లో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలిపారు అమరావతి మహిళలు. ఆయనకు మద్దతుగా మాట్లాడిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. 'సాక్షి ఛానల్‌పై కడుపు మంటతో నిరసన వ్యక్తం చేస్తున్నారని చెబుతూనే మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతేకాదు అమరావతి మహిళలను పిశాచులు, రాక్షసులు, రెండు కలిసిన సంకరజాతికి చెందినవారుగా వర్ణించారు. ఆ తెగకు చెందినవారిగా కనిపిస్తున్నారని, అలాంటి వారు మాత్రమే చేస్తారని' వ్యాఖ్యానించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతినేలా సజ్జల వ్యాఖ్యలు చేశారని భావించింది మాదిగ కార్పొరేషన్. ఆ సంస్థ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళలను హేళన చేయడంతోపాటు వారి పుట్టుకను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఒకేరోజు అధినేత, కీలక నేతపై కేసులు నమోదు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతోంది కేడర్.

# లడ్డూ కష్టాలకు ఫుల్ స్టాప్...

తిరుమల, జూన్ 24,తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. భక్తులకు లడ్డూ కష్టాలు తొలగించేందుకు కియోస్క్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దర్శన టికెట్ లేదా ఆధార్ నెంబర్ ను కియోస్క్ మిషన్ లో ఎంటర్ చేసి అక్కడ కనిపించే క్యూఆర్ కోడ్ పై పేమెంట్ చేస్తే రసీదు వస్తుంది. అది తీసుకెళ్లి కౌంటర్ లో అందిస్తే లడ్డూలు పంపిణీ చేస్తారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని భక్తుల సేవలు మరింత సులభతరం చేసే విధంగా టీటీడీ వినూత్న ఏర్పాట్లు చేసింది. తిరుమలలో లడ్డూ కౌంటర్ల వద్ద కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసింది. సాధారణంగా లడ్డూ ప్రసాదం కావాలంటే నేరుగా కౌంటర్ వద్దకు వెళ్లి ఆధార్ కార్డ్ లేదా దర్శన టికెట్లు చూపించి భక్తులు లడ్డూలు తీసుకునే వారు. అయితే, టీటీడీ నూతన విధానం తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా 5 కియోస్క్ మెషీన్లను లడ్డూ కౌంటర్ల దగ్గర ఏర్పాటు చేసింది.ఈ మెషిన్ లో భక్తులు తమ దర్శన టికెట్ టోకెన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఆ తర్వాత వారికి క్యూఆర్ కోడ్ వస్తుంది. దాన్ని ఫోన్ లో స్కాన్ చేయడం ద్వారా పేమెంట్ చేయాలి. ఆ తర్వాత ఒక స్లిప్ వస్తుంది. దాన్ని కౌంటర్ లో చూపిస్తే లడ్డూలు ఇస్తారు. దర్శన టికెట్ లేని భక్తులు సైతం లడ్డూలను పొందొచ్చు. అలాంటి భక్తులు తమ ఆధార్ నెంబర్ ను కియోస్క్ మెషిన్ లో నమోదు చేసి రెండు లడ్డూలను పొందొచ్చు. ఈ కొత్త సిస్టమ్ ని టీటీడీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ విధానం అన్నప్రసాదంలో ఉంది. డోనర్లు 99వేల రూపాయల వరకు నేరుగా డొనేషన్ చేసుకునే విధంగా ఇలాంటి కియోస్క్ మిషన్లు పెట్టింది.తాజాగా తిరుమల లడ్డూ కౌంటర్లలో కూడా కియోస్క్ మిషన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. భక్తులు మరింత సులభతరంగా లడ్డూలు పొందే అవకాశం ఉందని టీటీడీ అంటోంది. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రస్తుతం 5 కియోస్క్ మిషన్లు ఏర్పాటు చేశారు. భక్తులు వీటి ద్వారా లడ్డూలు పొందుతున్నారు. కొన్ని రోజుల పాటు దీన్ని పరిశీలన చేసి ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉంటే సరి చేసే విధంగా టీటీడీ దృష్టి పెట్టింది. అన్నప్రసాదం కేంద్రంలో డొనేషన్లు సమర్పించడానికి, లడ్డూలు పొందడానికి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసిన టీటీడీ త్వరలో గదులు పొందడానికి కూడా కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.





## ఏపీలో మరో నేషనల్ హైవేకు మహర్దశ

విజయవాడ, జూన్ 24, ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా 216హెచ్ జాతీయ రహదారికి మోక్షం కలిగింది. పెడన-లక్ష్మీపురం మధ్య 120.85 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారిని రూ.4245 కోట్లతో విస్తరించనున్నారు. ఈ హైవే గుడివాడ, హనుమాన్‌జంక్షన్, నూజివీడు మీదుగా లక్ష్మీపురం వరకు వెళ్తుంది. ఈ హైవే వల్ల పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు వాహనాల రద్దీ కూడా తగ్గుతుందని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవేలకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ క్రమంలో మరో హైవేకు మోక్షం కలిగింది. 216హెచ్ జాతీయ రహదారిలో పెడన-లక్ష్మీపురం మధ్య విస్తరించనున్నారు. ఈ 216హెచ్ రహదారి 120.85 కి.మీ మేర నాలుగు వరుసలుగా రూ.4245 కోట్లు కేటాయించారు. ఈ హైవే విషయానికి వస్తే.. పెడన నుంచి మొదలై.. 'గుడివాడ, హనుమాన్‌జంక్షన్, నూజివీడు, విసన్నపేట మీదుగా లక్ష్మీపురం' వరకు వెళ్తుంది. ఈ రహదారి విస్తరణ వల్ల పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని.. అలాగే వాహనాల రద్దీ తగ్గుతుందని భావిస్తున్నారు.ఈ నేషనల్ హైవే విస్తరణలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 9 చోట్ల బైపాస్‌ను నిర్మించాలని ప్లాన్ చేశారు. గుడివాడలో 15.3 కిలోమీటర్ల మేర.. హనుమాన్‌జంక్షన్‌లో 12.5 కిలోమీటర్ల మేర.. గుడ్లవల్లేరులో 6.7 కిలోమీటర్ల మేర బైపాస్‌లు రానున్నాయి. అన్నవరంలో 2.9 కి.మీ మేర, పుట్టగుంటలో 2.4 కి.మీ చిన్న బైపాస్‌లు వస్తాయి. మొత్తం 54.6 కి.మీ మేర బైపాస్‌లు.. హనుమాన్ జంక్షన్‌లో రైల్వే లైన్ క్రాసింగ్ దగ్గర ఆర్వోబీ ప్లాన్ చేశారు. మరికొన్ని బ్రిడ్జిలు, కల్వర్టులు కూడా రానున్నాయి. ఈ మేరకు ఈ హైవేకు సంబంధించి అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ హైవేకు అన్ని అనుమతులు అయ్యాక పనులు మొదలవుతాయంటున్నారు అధికారులు. ఈ హైవే విస్తరణ కోసం 700 ఎకరాల భూమిని సేకరించాలని.. దీనికి రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూమి ధరలను లెక్కించి.. ఆ తర్వాత దాని ప్రకారం పరిహారం అందజేస్తారు.ఈ నేషనల్ హైవేతో తెలంగాణకు, మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం కూడా ఏర్పడుతుందని చెబుతున్నారు. ఖమ్మం నుంచి గ్రానైట్‌ను మచిలీపట్నం పోర్టుకు తరలించడం ఈజీగా ఉ ంటుందంటున్నారు. నూజివీడు మామిడి పండ్లను రవాణా అనుకూలంగా ఉంటుంది. ఈ హైవే అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంగా వెళు తుంది.. దీంతో రాజధానికి కూడా జనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోతుందంటున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుంది. మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్‌కు కూడా ఉపయోగంగా ఉంటుంది. ఈ 216 హైవే?కు అనుసంధానంగా ఒంగోలు-కత్తిపూడి మధ్య ఆక్వా ఉత్పత్తులు, ఎగుమతులకు వీలుగా ఉంటుంది. డీపీఆర్ పూర్తి చేయడంతో అన్ని అనుమతులు రాగానే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.

## అమరగానం... ఏమైంది...


విశాఖపట్టణం, జూన్ 24, వైసీపీలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విపక్షాలపై ఒంటికాలు మీద లేచే గుడివాడ అమర్ నాథ్, ఇప్పుడు నోటికి అచితూచి పని చెబుతున్నారట. అసలు మీడియా ముందుకు రావడానికి కూడా ఇష్టపడట్లేదట. వైసీపీ ఘోర పరాజయం తర్వాత పార్టీ తరఫున మీడియా ముందుకు వచ్చి వాయిస్ వినిపించే అతి కొద్దిమంది నేతల్లో గుడివాడ ఒకరిగా ఉంటూ వచ్చారు.ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాలు, సమస్యలు, రాష్ట్రస్థాయి అంశాలపై కూడా గుడివాడ అమర్ విశాఖ నుంచే గళం వినిపించేవారు. అయితే కొద్ది రోజులుగా ఆయన పూర్తిగా సైలెంట్ అయ్యారు. అసలు పార్టీలో ఉన్నారా.? లేరా అన్నట్లుగా మారిపోయింది ఆయన తీరు. పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న గుడివాడ తీరును చూసి ఆయన వెంట తిరిగే కొద్దిమంది నేతలే ఆశ్చర్యపోతున్నారట. సొంత పార్టీ నేతలే ఆయన సినిమా అయిపోయిందని చర్చించుకుంటున్నారట.పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత ఆప్తుడుగా చెప్పుకునే గుడివాడ అమర్నాథ్ ఇప్పుడు పార్టీకి టచ్ మీ నాట్ అన్నట్లుగా ఉండటానికి కారణాలేంటనే దానిపై రాజకీయవర్గాలలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. దీని వెనుక అత్యంత బలమైన కారణాలే ఉన్నాయట. రెండున్నరేళ్ల పాటు మంత్రి పదవి అనుభవించిన గుడివాడ అమర్‌నాథ్ పార్టీ అధినేత జగన్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన వర్గీయులే చెబుతున్నారు.తాను కోరుకున్న నియోజకవర్గానికి తనను ఇంచార్జ్‌గా నియమించలేదన్న అసంతృప్తి ఆయనలో బాగా పెరిగిపోయిందంటున్నారు. అందుకే అధినేత జగన్‌పై గుడివాడ అమర్ తీవ్ర అసహనంతో ఉన్నారని విశాఖ వైసీపీలో చర్చ జరుగుతోంది. అందుకే పార్టీ ఆఫీస్ ముఖం కూడా చూడటం లేదట గుడివాడ అమర్. ఇందుకు కారణం ఆయన కోరుకున్న విశాఖ నగర నియోజకవర్గ ఇంచార్జ్ పదవి దక్కకపోవడమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.గత ఎన్నికల్లో గుడివాడ అమర్నాథ్ గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాస్ గుడివాడ అమర్‌పై విజయం సాధించారు. దీంతో ఆయన ఏకంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే గుడివాడ అమర్ విశాఖలో వాలిపోయారు. విశాఖ నగర పరిధిలో ఏదో ఒక నియోజకవర్గాన్ని తనకు అప్పగిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.కానీ జగన్ మాత్రం గుడివాడకు విశాఖ నగరం, రూరల్ కూడా కాకుండా చోడవరం నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. దీంతో గుడివాడ తీవ్ర అసంతృప్తికి గురయ్యారట. అక్కడితో ఆగకుండా విశాఖ జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి కూడా గుడివాడను పీకేశారు జగన్. ఇది తనకు పొమ్మనలేక పొగపెట్టినట్లేనని భావిస్తున్నారట అమర్. 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి గెలిచి మంత్రిగా ఉన్న ఆయనను ఆ నియోజకవర్గ నుంచి తప్పించి చివరి నిమిషంలో గాజువాక టికెట్ ఇవ్వడమే అవమానంగా ఫీల్ అవుతుంటే..ఎన్నికల తర్వాత గాజువాక ఇంచార్జ్ గానైనా కొనసాగించకుండా, జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు కూడా లేకుండా చేయడంతో..తీవ్ర నిరాశలో ఉన్నారట గుడివాడ.అందుకే పార్టీకీ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సైలెంటైపోయారని టాక్ వినిపిస్తోంది. మంత్రిగా ఉన్నప్పుడు సీనియర్లను కూడా లెక్కచేయకపోవడం, తనంతటి వాడే పార్టీలో లేడు అన్నట్లుగా బిహేవ్ చేయడంతోనే..గుడివాడకు గ్రౌండ్ పాలిటిక్స్ తెలుసొచ్చేలా చేయడానికే వేసిందని అంటున్నారు. అసంతృప్తిలో ఉన్నప్పటికీ మళ్లీ పాత రోజులు వస్తాయని గంపెడు ఆశలతో ఎదురు చేస్తున్నారట గుడివాడ. ఆయన ఆశలు నెరవేరుతాయో లేదో చూడాలి మరి.

# ఎక్కువగా ఆవలింతలు వస్తున్నాయా? ఇది ఎలాంటి ఆరోగ్య సమస్యలకు సంకేతమో తెలుసా?



ఆవలింతలు మనందరికీ అనుభవమే.మన శరీరంలోని సహజ ప్రక్రియలలో ఒకటి. ఇవి సాధారణంగా నిద్ర వస్తున్నప్పుడు, బోర్ కొట్టినప్పుడు, అలసట వంటివాటికి సంకేతంగా వస్తుంటాయి. ఎదుటివారు ఆవలిస్తుంటే మనకు కూడా ఆవలింతలు వస్తాయి. ఇది ఒక సహజమైన శారీరక చర్య. కానీ, ఒక్కోసారి ఎక్కువగా ఆవలింతలు రావడం వెనుక కొన్ని కారణాలు ఉంటాయి. అవేంటో తెలుసుకుందాం. ఆవలింతలు ఎందుకు వస్తాయి? ఆవలింత అనేది ఒక సహజమైన శ్వాసకోశ చర్య. ఇది సాధారణంగా నోరు తెరిచి, లోతుగా గాలి పీల్చుకుని, నెమ్మదిగా వదలడం. ఆవలింతలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. అయితే, తరచుగా అధికంగా ఆవలింతలు వస్తుండటం ఆరోగ్య సమస్యల గురించి సంకేతమివ్వవచ్చు. నిద్ర - అలసట: నిద్రలేమి, అలసట లేదా మగతగా ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. శరీరం విశ్రాంతి తీసుకోవాలని సంకేతం చేస్తుంది. శరీరానికి తగినంత విశ్రాంతి లేనప్పుడు, మెదడు, శరీరం నెమ్మదిస్తాయి, దీనివల్ల ఆవలింతలు వస్తాయి. బోరు కొట్టడం : బోర్ కొట్టినప్పుడు లేదా నిస్తేజంగా ఉన్నప్పుడు కూడా ఆవలింతలు వస్తాయి. ఇది మెదడును ఉత్తేజపరచడానికి ఒక మార్గం. ఆవలింతలు మెదడుకు ఎక్కువ ఆక్సిజన్ ను సరఫరా చేయడానికి సహాయపడతాయి, ఇది మనల్ని మరింత అప్రమత్తంగా ఉంచుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: కొత్త పరిశోధనల ప్రకారం, ఆవలింతలు మెదడును చల్లబరచడానికి సహాయపడతాయి. శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు ఆవలింతలు వస్తాయి. ఆవలింతల ద్వారా చల్లని గాలి పీల్చడం వల్ల మెదడు ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. వ్యాయామం చేసినప్పుడు లేదా వేడి వాతావరణంలో ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా రావడానికి ఇది ఒక కారణం. రైలు బోగీలో ఒంటరిగా యువతి, కన్నేసిన కామాంధుడు । ఇతరులు ఆవలింతలు వేయడం చూసినప్పుడు మనకు కూడా ఆవలింతలు రావడం సహజం. ఇది సానుభూతి, సామాజిక బంధంతో ముడిపడి ఉంటుంది. ఇతరుల భావోద్వేగాలను గుర్తించడంలో, ప్రతిస్పందించడంలో మనకున్న సహజ సామర్థ్యం వల్ల ఇది జరుగుతుంది. వైద్య పరిస్థితులు: కొన్నిసార్లు, ఎక్కువగా ఆవలింతలు రావడం కొన్ని వైద్య పరిస్థితులకు సంకేతం కావచ్చు, ముఖ్యంగా ఇతర లక్షణాలు కూడా ఉంటే. కొన్ని వైద్య పరిస్థితులు ఆవలింతలను పెంచుతాయి: గుండె సమస్యలు: గుండె చుట్టూ రక్తస్రావం లేదా గుండెపోటు వంటి గుండె సమస్యలు ఉన్నప్పుడు, మెదడుకు రక్త ప్రవాహం తగ్గుతుంది. దీనివల్ల ఆవలింతలు వస్తాయి. ఒక్కొసారి మూర్ఛ వచ్చే ముందు లేదా మూర్ఛ సమయంలో కొందరికి ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. మెదడు కణితులు: మెదడులో కణితులు లేదా స్ట్రోక్ కారణంగా మెదడు దెబ్బతిన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. నాడీ సంబంధిత వ్యాధిలో, మెదడు, వెన్నుపాములోని నరాల కవచం దెబ్బతింటుంది. ఇది ఆవలింతలను పెంచుతుంది. వాగస్ నాడి అనేది మెదడు నుండి శరీరంలోని అనేక భాగాలకు వెళ్లే ఒక పెద్ద నాడి. ఈ నాడి ఉద్దీపన చెందినప్పుడు ఆవలింతలు వస్తాయి. ఇది వికారం, వాంతులు మరియు గొంతు నొప్పి వంటి సమస్యలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. మందులు: కొన్ని యాంటిడిప్రెసెంట్స్, యాంటిహిస్టామైన్స్ మరియు నొప్పి నివారణ మందులు వంటి కొన్ని మందులు దుష్ప్రభావాలుగా ఆవలింతలను పెంచుతాయి. ఎప్పుడు ఆందోళన చెందాలి? సాధారణంగా ఆవలింతలు ప్రమాదకరమైనవి కావు. కానీ, మీరు తరచుగా, ఎక్కువగా ఆవలింతలు వేస్తుంటే వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం . విపరీతమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి, గుండె దడ, తల తిరగడం, బలహీనత, శరీర భాగాలలో తిమ్మిర్లు ఈ లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

# మూడు రోజులు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటే ఏం జరుగుతుందో తెలుసా..?



స్మార్ట్‌ఫోన్‌లు ఆధునిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగమయ్యాయి. వాటి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి, అయితే కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి.స్మార్ట్‌ఫోన్‌లు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కనెక్ట్ చేయడానికి సహాయపడతాయి.ఫోన్ కాల్స్, టెక్స్ట్ మెసేజ్‌లు, ఈమెయిల్‌లు, సోషల్ మీడియా ద్వారా సులభంగా ఇతరులతో సంభాషించవచ్చు. అయితే స్మార్ట్‌ఫోన్‌లకు ఎక్కువ సమయం కేటాయించడం వల్ల వ్యసనంగా మారవచ్చు. వరుసగా మూడు రోజుల పాటు దూరంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. మానసిక ప్రశాంతత నిరంతర నోటిఫికేషన్‌లు, సోషల్ మీడియా అప్‌డేట్‌ల నుండి విముక్తి లభిస్తుంది.ఒత్తిడి, ఆందోళన స్థాయిలు తగ్గుతాయి.మనస్సు ప్రశాంతంగా, ఏకాగ్రత పెరుగుతుంది. మెరుగైన నిద్ర స్క్రీన్ నుండి వెలువడే నీలి కాంతి నిద్ర నాణ్యతను తగ్గిస్తుంది.ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల నిద్ర హార్మోన్ల ఉత్పత్తి మెరుగుపడుతుంది.గాఢమైన, ప్రశాంతమైన నిద్ర లభిస్తుంది. కంటి ఆరోగ్యం దీర్ఘకాలం స్క్రీన్ చూడటం వల్ల కళ్ళు పొడిబారడం, దృష్టి మందగించడం వంటి సమస్యలు వస్తాయి.ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల కళ్ళకు విశ్రాంతి లభిస్తుంది. కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. శారీరక ఆరోగ్యం తక్కువ కదలిక, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వస్తాయి.ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల శారీరక శ్రమ పెరుగుతుంది.శరీరం చురుకుగా ఉంటుంది. !" సామాజిక సంబంధాలు ఫోన్ లేకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపవచ్చు.వ్యక్తిగత సంబంధాలు బలపడతాయి.సంతోషంగా ఉంటారు. ఉత్పాదకత పెరుగుదల ఏకాగ్రత మెరుగుపడటం వలన పనిలో ఉత్పాదకత పెరుగుతుంది.సృజనాత్మకత పెరుగుతుంది.మానసిక ఆరోగ్యంమానసిక స్థితి మెరుగుపడుతుంది.నిరాశ, కుంగుబాటు వంటివి తగ్గుతాయి.

# ఇలా చేస్తే చాలు ..గర్భం వద్దన్నా వచ్చేస్తోంది..!

ఈ రోజుల్లో పది మంది పెళ్లయిన జంటల్లో ఇద్దరు, ముగ్గురిలో సంతానం గురించి బాధపడుతున్న వారే దర్శనం ఇస్తున్నారు. సంతానం కోసం డాక్టర్ల చుట్టూ తిరుగుతూ.. డబ్బుతో పాటు, తమ విలువైన సమయాన్ని కూడా వృథా చేసుకుంటున్నారు. చిన్న చిన్న చిట్కాలతో ఈ సంతనోత్పత్తి సమస్యకు చెక్ పెట్టవచ్చు. మనం తినే ఆహార అలవాట్లను మార్చుకుంటే ఈజీగానే గర్భం దాల్చే అవకాశాలు లేకపోలేదు. మీరు గర్భం పొందడానికి ప్రయత్నిస్తున్నట్లయితే, మీ ఆహారం మీ సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతుంది. సంతనోత్పత్తిని పెంచే ఆహారాలకు మీ ఆహారంలో ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మీకు గర్భం దాల్చడానికి మరింత అవకాశం ఉంటుంది. సంతనోత్పత్తిని పెంచే ఆహారాలలో ఇవి ఉన్నాయి: ఆకుకూరలు: ఆకుకూరలు విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలాలు, ఇవి అండోత్సర్గం మరియు స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆకుకూరలలో పాలకూర, బ్రకోలి, కాలే, మెంతులు మీ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తాయి. పుచ్చకాయలు మీ మూడ్‌ను పెంపోందిస్తాయి. పండ్లు: పండ్లు ఫోలిక్ యాసిడ్, విటమిన్ అ మరియు యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలాలు, ఇవి గర్భస్రావం నుండి రక్షించడంలో సహాయపడతాయి. పండ్లలో నారింజ, యాపిల్, బెర్రీలు మరియు దానిమ్మపండు ఉన్నాయి. తృణధాన్యాలు: తృణధాన్యాలు ఫైబర్, మినరల్స్ మరియు విటమిన్లకు మంచి మూలాలు, ఇవి హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. తృణధాన్యాలలో బ్రౌన్ రైస్, క్వినోవా, బార్లీ మరియు గోధుమ ఉన్నాయి. ప్రోటీన్: ప్రోటీన్ అండాలు, మాంసం, చేపలు, పప్పులు మరియు గుడ్లు వంటి ఆహారాల నుండి లభిస్తుంది. ప్రోటీన్ స్పెర్మ్ ఉత్పత్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు: ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు చేపలు, బీన్స్, గింజలు మరియు నట్స్ వంటి ఆహారాల నుండి లభిస్తాయి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మీరు గర్భం పొందడానికి ప్రయత్నిస్తున్నట్లయితే, మీ ఆహారంలో ఈ ఆహారాలను చేర్చడం ద్వారా మీ సంతానోత్పత్తిని మెరుగుపరచడానికి మీరు చర్య తీసుకోవచ్చు. అదనంగా, ఆరోగ్యకరమైన బరువును కలిగి ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మరియు మద్యం మరియు పొగతాగడం వంటి అలవాట్లను నివారించడం ద్వారా మీరు మీ సంతానోత్పత్తిని మెరుగుపరచవచ్చు.




# ప్రపంచంలో అత్యంత ఖరీదైన పండు ఏదో తెలుసా..?



పండ్లు మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. అవి విటమిన్లు, ఖనిజాలు, మరియు ఫైబర్ వంటి అవసరమైన పోషకాలను అందిస్తాయి, ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. మార్కెట్‌లో చాలా రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయనే విషయం తెలిసిందే. అయితే ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పండుగా యుబారి కింగ్ మెలోన్ నిలిచింది. ఈ పండు జపాన్‌లో మాత్రమే దొరుకుతోంది. యుబారి కింగ్ పుచ్చకాయ జపాన్ లోని హ్వాక్కైడో ద్వీపంలోని యుబారిలో పండించే ఒక రకమైన పుచ్చకాయ. ఇది దాని తీపి రుచి, పరిపూర్ణ ఆకారం మరియు అధిక ధరకు ప్రసిద్ధి చెందింది. యుబారి కింగ్ మెలోన్ ప్రత్యేకతలు యుబారి కింగ్ పుచ్చకాయలు గుండ్రంగా మరియు నునుపైన చర్మంతో ఉంటాయి.లోపల గుజ్జు నారింజ రంగులో మరియు చాలా తీపిగా ఉంటుంది.దీని వాసన కూడా చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.ఈ పండును చుగెన్ (జపాన్ లో బహుమతులు ఇచ్చే సంప్రదాయం) సందర్భంగా బహుమతిగా ఇస్తారు.ఈ పుచ్చకాయ యొక్క ప్రత్యేకత ఏమిటంటే దీనిని చాలా జాగ్రత్తగా పెంచుతారు. ప్రతిరోజు ఈ పండును శుభ్రం చేస్తారు.ఈ పుచ్చకాయలు 1.5 నుండి 2 కిలోల బరువు వరకు ఉంటాయి. పుచ్చకాయను కంటాలౌప్ మరియు బర్ఫీస్ స్పైసీ కంటాలౌప్ అనే రెండు రకాల పుచ్చకాయల మిశ్రమం ద్వారా తయారు చేస్తారు.ఈ యుబారి పుచ్చకాయలు జూన్ నుండి ఆగష్టు మొదటి వారం వరకు మాత్రమే దొరుకుతాయి.2018 సంవత్సరంలో రెండు యుబారి కింగ్ పుచ్చకాయలు 3.2 మిలియన్ జపనీస్ యెన్లకు అమ్ముడయ్యాయి.2019లో ఒక జత యుబారి కింగ్ మెలోన్ 46,500 డాలర్లకు (సుమారు 35 లక్షల రూపాయలు) అమ్ముడయ్యింది. ఇవే కాకుండా ప్రపంచంలో ఖరీదైన పండ్ల జాబితాలో మియాజాకి మామిడి, రూబీ రోమన్ ద్రాక్ష, డెన్సుకే పుచ్చకాయ వంటివి ఉన్నాయి.






# నిర్మాతగా రామ్ పోతినేని..!

హీరోలు నిర్మాతలు అయినంత తేలికగా నిర్మాతలు హీరోలు కాలేరు. కానీ అప్పుడప్పుడు టెక్నీషియన్స్ కూడా హీరోలుగా తమ అదృష్టం పరీక్షించుకుంటూ ఉంటారు. నిజానికి దర్శకులు చాలామంది తమకు నచ్చిన కథను నిర్మాతగా మారితేనే చేయగలమనే నమ్మకంతో ప్రొడ్యూసర్స్ అవుతుంటారు. హీరోలు కూడా తమకు నచ్చిన దర్శకుడిని, నచ్చిన కథను తెర మీద చూసుకోవడానికి నిర్మాతలుగా మారుతుంటారు. అయితే కొందరు కేవలం తామే హీరోలుగా నటించడం కాకుండా కథానుగుణంగా యంగ్ టాలెంట్ నూ ప్రోత్సహిస్తూ ఉంటారు. నాని అలా 'అ', 'హిట్' చిత్రాలను నిర్మించాడు. 'హిట్ –3'లో తానే హీరోగా చేశాడు. విజయ్ దేవరకొండ కూడా తనతో 'పెళ్ళిచూపులు' సినిమా తెరకెక్కించిన దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా 'మీకు మాత్రమే చెబుతా' మూవీని తీశాడు. తాజాగా యంగ్ హీరో ఉస్తాద్ రామ్ పోతినేని సైతం నిర్మాతగా మారబోతున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ కు గడ్డు కాలం నడుస్తోంది. అతని చిత్రాలన్నీ బాక్సాఫీస్ బరిలో వరుసగా ఫెయిల్ అవుతున్నాయి. 'స్కంద, డబుల్ ఇస్మార్ట్' పరాజయాల నుండి కాస్తంత కోలుకున్న రామ్ ఇప్పుడు 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమాలో నటిస్తున్నాడు. ఆంధ్రా కింగ్ గా ఉపేంద్ర నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్ బాబు దీనికి దర్శకుడు. ఈ సినిమా కోసం రామ్ గీత రచయితగానూ మారాడు. అలానే త్వరలో నిర్మాత అవుతున్నాడని సమాచారం. విశేషం ఏమంటే... ఇప్పటికే తెలుగు సినిమా రంగంలో రామ్ పెద్దనాన్న రవికిశోర్ 'స్రవంతి మూవీస్' పేరుతో సినిమాలు నిర్మిస్తున్నారు. రామ్ తోనే కాకుండా ఆయన బయటి హీరోలతోనూ సినిమాలు తీస్తున్నారు. అయితే... పెదనాన్న నీడలో కాకుండా తన అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు నిర్మించాలని రామ్ భావించాడట. అందుకే ఓన్ బ్యానర్



పెట్టబోతున్నాడని తెలిసింది. తొలి చిత్రం ద్వారా ఓ కొత్త దర్శకుడిని రామ్ పరిచయం బోతున్నాడట. అయితే ఈ సినిమాలో రామ్ నటిస్తాడా? వేరే వాళ్ళతో కేవలం మూవీ మాత్రం నిర్మిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ విడుదలైన తర్వాత ఓన్ బ్యానర్ కు సంబంధించిన ప్రకటన వస్తుందని తెలుస్తోంది.



# హీరో, హీరోయిన్‌ల పారితోషికం వ్యత్యాసం.. కీర్తి సురేష్ కామెంట్స్!

: సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా ప్రతి చోట ఆడవారి కంటే మగవారికి పారితోషికం/జీతం ఎక్కువగా ఉంటుంది. అన్ని చోట్ల ఆడవారు చేసే పనికి పారితోషికం అనేది తక్కువగానే ఉంటుంది. మగవారితో సమానంగా పని చేస్తున్నప్పటికీ తమకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి ఆడవారు కొందరు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఇక సినిమా ఇండస్ట్రీలో హాలీవుడ్ నుంచి మొదలుకుని అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలో కూడా హీరోలదే ఆదిపత్యం అనడంలో ఎలాంటి సందేహం లేదు. హీరోలకు కోటాను కోట్ల పారితోషికం అందుతూ ఉంటే, హీరోయిన్స్ మాత్రం అందులో పది నుంచి ఇరవై శాతం పారితోషికం మాత్రమే అందుకోవడం ప్రతి భాష ఇండస్ట్రీలోనూ జరుగుతుంది. ఇటీవల సమంత తన సినిమా శుభం ప్రమోషన్‌లో భాగంగా ఆసక్తికర కామెంట్స్ చేసింది. తాము నిర్మించిన శుభం సినిమా లో నటించిన ప్రతి ఒక్కరికి సమాన వేతనం ఇచ్చినట్లు పేర్కొంది. ఆడ, మగ అనే తేడా లేకుండా నటీ నటులు, సాంకేతిక నిపుణులకు పారితోషికాలు ఇచ్చినట్లు పేర్కొంది. ఇండస్ట్రీలో ఉన్న ఈ వ్యత్యాసంను తగ్గించాల్సిన అవసరం ఉందని, హీరోయిన్స్‌కు వారి కష్టంకు తగ్గట్లుగా పారితోషికం ఇవ్వాల్సిందే అన్నట్లుగా సమంత అభిప్రాయం వ్యక్తం చేసింది. సమంత చేసిన ఆ వ్యాఖ్యల తర్వాత సోషల్ మీడియాలో ప్రముఖంగా చర్చ మొదలు అయింది. చాలా మంది హీరోయిన్స్ ఈ విషయం గురించి స్పందించారు, కొందరు ఇంటర్వ్యూల్లో ఈ విషయం గురించి స్పందిస్తున్నారు. తాజాగా మహానటి ఫేం కీర్తి సురేష్ సైతం ఈ విషయం గురించి స్పందించింది. ఇన్నాళ్లు సమాన వేతనం గురించి మౌనంగా ఉంటూ వచ్చిన కీర్తి సురేష్ తన వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా మాట్లాడుతూ.. హీరోల స్థాయిలో హీరోయిన్స్‌కి కూడా ప్రేక్షకులను థియేటర్‌కి రప్పించే సామర్థ్యం ఉంటే, వారికి ఆ క్రేజ్, సత్తా ఉంటే కచ్చితంగా హీరోల స్థాయిలో పారితోషికం ఇచ్చి తీరాల్సిందే అంటూ కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. హీరోయిన్స్‌ల్లో చాలా మంది ప్రేక్షకులను థియేటర్స్‌కి రప్పించగల సామర్థ్యంను కలిగి ఉన్నారు. కానీ వారు కూడా పారితోషికం చాలా తక్కువ తీసుకుంటున్నారు. వందల కోట్ల పారితోషికం తీసుకుంటున్న హీరోలు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు. హీరోయిన్స్ మాత్రం కనీసం 10 కోట్ల పారితోషికం అందుకునే పరిస్థితి లేదు. ఇండియన్ సినిమా ఇండస్ట్రీ మొత్తం మీద రూ.10 కోట్లు, అంతకు మించి పారితోషికం తీసుకునే హీరోయిన్స్ కనీసం 10 మంది కూడా ఉండరు అనడంలో అతిశయోక్తి లేదు. చిన్న హీరోలు, కొత్తగా ఎంట్రీ ఇచ్చిన హీరోలు సైతం ఒకటి రెండు హిట్స్ పడగానే రూ.10 నుంచి పాతిక కోట్ల పారితోషికం తీసుకుంటూ ఉన్నారు.



# మహేష్ బాబు రివ్యూ : ఆ సినిమా నవ్విస్తూ, ఏడిపించింది



బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్ తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రివ్యూవర్స్ నుంచి మిశ్రమ స్పందన దక్కించుకున్న ఈ సినిమాకు కమర్షియల్‌గా డీసెంట్ ఓపెనింగ్స్ దక్కినట్లు సమాచారం అందుతోంది. మెల్ల మెల్లగా ఈ సినిమా ప్రేక్షకులకు ఎక్కుతుందని, తప్పకుండా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద లాంగ్ రన్‌లో సాలిడ్ కలెక్షన్స్‌ను రాబడుతుంది అనే విశ్వాసంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆమీర్ ఖాన్ చేసిన ఈ ప్రయత్నంను పలువురు స్టార్స్ అభినందిస్తున్నారు. సమాజంలో ఉన్న ఒక వర్గం పిల్లల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. వారికి దక్కాల్సిన ప్రేమ, చదువు వారికి దక్కడం లేదు. అలాంటి వారి నేపథ్యంలో ఈ సినిమాను ఆమీర్ ఖాన్ చేయడం జరిగింది. ఈ కాన్సెప్ట్ ఓరియంటెడ్ మూవీలో ఆమీర్ ఖాన్‌కు జోడీగా జెనీలియా నటించిన విషయం తెల్సిందే. సినిమాకు ఆర్ ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించారు. ఆమీర్ ఖాన్ స్వయంగా ఈ సినిమాను నిర్మించిన నేపథ్యంలో అంచనాలు భారీగా పెరిగాయి. అందుకు తగ్గట్లుగానే సినిమా ఉందనే టాక్ వచ్చింది. దశాబ్ద కాలంగా ఆమీర్ ఖాన్ కమర్షియల్ హిట్ అందుకోలేక పోయాడు. ఈ సినిమాతో ఆ లోటు తీరుతుందని ఆమీర్ ఖాన్ ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూశారు. సినిమాకు వస్తున్న రిపోర్ట్స్ విషయంలో ఆమీర్ ఖాన్ సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన సన్నిహితులు సోషల్ మీడియాలో ఆ విషయాన్ని గురించి పోస్ట్ చేస్తూ తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. తాజాగా ఈ సినిమాపై టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు స్పందించారు. ఇలాంటి కాన్సెప్ట్ ఓరియంటెడ్ సినిమాలకు మహేష్ బాబు మద్దతు ఖచ్చితంగా ఉంటుంది. ఆ విషయం మరోసారి నిరూపితం అయ్యింది. ఆయన ఈ సినిమాను జనాల్లోకి తీసుకు వెళ్లడం కోసం, ఇలాంటి మంచి కంటెంట్‌ను జనాలు చూడాలి అనే ఉద్దేశంతో సినిమాకు రివ్యూ ఇచ్చారు. సినిమాకు ఆయన ఇచ్చిన రివ్యూ తెలుగు మీడియాలో బాగా పబ్లిసిటీ అయ్యి, సినిమాకు భారీగా పబ్లిసిటీ తెచ్చి పెట్టడం ఖాయం. దాంతో సినిమాకు మంచి వసూళ్లు నమోదు అవుతాయి అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహేష్ బాబు చాలా అరుదుగా మాత్రమే తాను చూసిన సినిమాల గురించి సోషల్ మీడియాలో స్పందిస్తూ ఉంటాడు... సితారే జమీన్ పర్ సినిమా అద్భుతంగా ఉంది. ఆమీర్ ఖాన్ గారి గత క్లాసిక్ సినిమాల తరహాలోనే ఈ సినిమా కూడా చక్కగా ఉంది. ఆయన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా మిమ్ములను కచ్చితంగా ఆకట్టుకుంటుంది. మిమ్ములను ఈ సినిమా నవ్వించడంతో పాటు ఏడిపిస్తుంది. అంతే కాకుండా మీకు తెలియకుండానే చప్పట్లు కొట్టిస్తుంది. అన్ని వర్గాల వారిని మెప్పించే విధంగా సినిమా ఉంటుందని అన్నట్లుగా మహేష్ బాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మహేష్ బాబు ట్వీట్ కచ్చితంగా సినిమాకు అదనపు రెవిన్యూ తీసుకు వస్తుందని అంతా భావిస్తున్నారు. మహేష్ బాబు ఈ సినిమాను సమర్ధించడం, రివ్యూ ఇవ్వడంపై అంతా కూడా అభినందనలు తెలియజేస్తున్నారు.

# సూర్య – వెంకీ.. సర్ ప్రైజ్ ఏమిటంటే..



తమిళ స్టార్ హీరో సూర్య, తెలుగు యువ దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'సూర్య 46' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమాకు ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య ఇటీవల జై భీమ్, రెట్రో వంటి సినిమాలతో తన పెర్ఫామెన్స్‌కు మంచి మార్కులు కొట్టేశాడు. ఇప్పుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ డిఫరెంట్ డ్రామాలో కనిపించనున్నాడు. గతంలో వెంకీ తీసిన 'సార్' వంటి ఎమోషనల్ స్క్రిప్ట్‌లకు సూర్య వంటి నటుడి పెర్ఫామెన్స్ తోడైతే.. సినిమా స్థాయే మరో లెవెల్ లో ఉంటుందని అంచనా. ఈ కాంబినేషన్‌పై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ ప్రేక్షకుల్లోనూ భారీ ఆసక్తి నెలకొంది. ఇప్పుడిది మరింత హైప్‌ను సృష్టిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో సూర్య పాత్ర రెండు కోణాలతో ఉంటుంది. ఒకవైపు ఓ పాజిటివ్ యాంగిల్ చూపించగా.. మరోవైపు నెగిటివ్ షేడ్స్ కనిపించనున్నాయట. ప్రత్యేకమైన లుక్‌తో వెంకీ అట్లూరి సూర్యను డిజైన్ చేస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం ఓ యాక్షన్ సీన్ చిత్రీకరణ జరుగుతోంది. ఇదే యాక్షన్ బ్లాక్ సినిమాకే హైలైట్ గా నిలవబోతోందట. సూర్య అభిమానులకు ఇది పక్కా విజువల్ ట్రీట్ కానుంది. ఇప్పటికే మ్యూజిక్ పనులు స్టార్ట్ చేశాడు. వెంకీ అట్లూరి సినిమాలకు జీవీ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటుంది. ఈ సినిమాకి కూడా మాస్ అండ్ ఎమోషనల్ ట్రాక్స్‌ను సిద్ధం చేస్తున్నాడట. ఈ చిత్రంలో హీరోయిన్ గా మమిత బైజు నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక సీనియర్ నటి రవీనా టాండన్, రాధిక శరత్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. 2025 చివరిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్లాన్ చేస్తున్నాడు. సూర్య స్టైలిష్ లుక్, డ్యూయల్ షేడ్స్, ఎమోషనల్ టచ్‌తో వెంకీ అట్లూరి చెప్పబోయే కథ ఎంతవరకూ వర్కౌట్ అవుతుందో చూడాలి.

విజయ సారథి



# 2025-26 వార్షిక రుణ ప్రణాళిక క్రింద జిల్లాలోని వివిధ ప్రాధాన్యతా రంగాలకు 26,409 కోట్లు బ్యాంకు రుణాలు కల్పన లక్ష్యం నిర్ధేశించామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు

కాకినాడ జూన్ 24: మంగళవారం మద్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో బ్యాంకులు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రుణాల లక్ష్య సాధన ప్రగతి సమీక్ష కమిటీ సమావేశాలు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో తొలుత కడపటి సమావేశంలో కమిటీలు చర్చించి సూచించిన అంశాలపై తీసుకున్న చర్యలను సమీక్షించి, అనంతరం 2025-26 సంవత్సర తొలి త్రైమాసంలో సాధించిన ప్రగతిపై చర్చించారు. అలాగే 2025-26 ఆర్ధిక సంవత్సరలో జిల్లాలోని వివిధ రంగాలకు నిర్ధేశించిన వార్షిక రుణ ప్రణాళిక డాక్యుమెంట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మార్చి 31తో ముగిసిన ఆర్ధిక సంవత్సరంలో జిల్లాలో వివిధ ఆర్ధిక రంగాల వారిగా నిర్ధేశించుకున్న వార్షిక రుణ లక్ష్యాలను మించి రుణాలు కల్పించినందుకు బ్యాంకర్లకు అభినందనలు తెలిపారు. 2024-25 సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు 11,460 కోట్లు రుణాలు కల్పించే లక్ష్యానికి గాను, 13,770 కోట్లు రుణాలు కల్పించి 120.15 శాతం లక్ష్యాలను సాధించడం ముదావహమన్నారు. అలాగే ఎంఎస్ఎంఈ, ఇతర ప్రాధాన్యతా రంగాలకు 16370 కోట్లు రుణాలు అందించే లక్ష్యాన్ని మించి 18948 కోట్లు రుణాల కల్పన ద్వారా 115.74 శాతం లక్ష్యసాధన జరిగిందన్నారు. 2025-26 ఆర్ధిక సంవత్సరంలో కూడా ఇదే స్పూర్తితో అన్ని రంగాలకు రుణాలు విరివిగా రుణాలు కల్పించి ఆర్ధిక ప్రగతిలో జిల్లా మరింత ముందుకు సాగేందుకు సహకరించాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. అలాగే పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా కేంద్ర, రాష్ట్ర పభుత్వాల అత్యంత ప్రాధాన్యతగా చేపట్టిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ల ఏర్పాటులో లబ్దిదారులకు రుణాల కల్పనలో బ్యాంకర్లు మరింత చొరవగా ముందుకు రావాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఈ ప్లాంట్ల ఏర్పాటుకు 2,262 ధరఖాస్తులు అందగా, 1,024 ప్లాంట్లకు బ్యాంకులు 20 కోట్ల 36 లక్షల మేరకు రుణాలు కల్పించాయన్నారు. సోలార్ యూనిట్లకు రుణాల కల్పన ప్రగతిని ప్రతీ వారం సమీక్షిస్తామని, తిరస్కరించే ధరఖాస్తులేవైనా ఉంటే అందుకు సవివరమైన కారణాలు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 10500 మంది మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డు జారీచేయగా, 8 వేల మంది రైతులు పంట రుణాల కొరకు బ్యాంకులకు ధరఖాస్తు చేసుకోవడం జరిగిందని, వీరందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పూర్తి పరిమితి మేరకు రుణాలు కల్పించాలని బ్యాంకులను కలెక్టర్ కోరారు. అలాగే వ్యవసాయ డ్రోన్ల ప్రోత్సహిస్తూ వాటికి కూడా విరివిగా రుణాలు అందించాలన్నారు. స్వయం సహాయ బృందాలకు నిర్ధేశించిన లక్ష్యాలను మించి బ్యాంకు రుణాలు కల్పించాలని, వాటితో పాటు విద్య, హౌసింగ్ రుణాల స్థాయిని మరింత పెంచాలని కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాల కల్పించి పశుపోషణ, మత్స్య రంగాలను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ఫైనాన్షిల్ సర్వీసెస్ శాఖ సూచనల కనుగుణంగా జూలై 1వ తేదీ నుండి 3 నెలల పాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పియం జన్ ధన్ యోజన, పియం జీవన జ్యోతి, పియం సురక్ష యోజనలు, అటల్ పెన్షన్ యోజన తదితర ఫైనాన్షియల్ ఇన్ క్లూజన్ పధకాలపై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందేలా ప్రత్యేక కాంపేయిన్ బ్యాంకర్లు నిర్వహించాలని కోరుతూ, ఇందుకు అవసరమైన సహకారాన్ని జిల్లా, మండల అధికారులు అందిస్తారని తెలిపారు. అలాగే గ్రామిణ ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకింగ్, అర్ధిక అంశాలపై అవగాహనకు ఫైనాన్షియల్ లిట్రసీ కార్యక్రమాలను అన్ని బ్యాంకులు తప్పక నిర్వహించాలని, అర్హులైన వారందరూ పియంఈజిపి, స్టాండ్ అప్ ఇండియా, ముద్రా యోజనా, పియం ఎఫ్ఎంఈ, పియం స్వానిధి పధకాలను సద్వినియోగం చేసుకుని ఆర్ధికంగా ఎదిగేందుకు



తోడ్పడాలని కోరారు. 2025-26 వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ మంగళవారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి 2025-26 ఆర్ధిక సంవత్సరానికి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు నిర్ధేశించిన వార్షిక రుణ ప్రణాళిక డాక్యుమెంటును ఆవిష్కరించారు. ఈ ప్రణాళికలో జిల్లాలోని వివిధ రంగాలకు ఈ ఆర్ధిక సంవత్సరం మొత్తం 26,409 కోట్లు రూపాయలు రుణాలు కల్పించాలని లక్ష్యం నిర్ధేశించి, ఆయా రంగాల వారిగా రుణ లక్ష్యాలు ఈ విధంగా పొందుపరిచారు:వ్యవసాయ రంగానికి పంటరుణాలు 7,535 కోట్లు (ఖరీఫ్-4446, రబీ-3089), టర్మ్ లోన్లు 4076 కోట్లు, అగ్రిన్ఫ్రా, యాన్సిలరీ రుణాలు 2,131 కోట్లు, వెరసి మొత్తం 13,733 కోట్లు వార్షిక లక్ష్యం నిర్ధేశించారు.×ఎంఎస్ఎంఈ రంగానికి 6,513 కోట్లు, విద్యా రుణాలు 86 కోట్లు, హౌసింగ్ రుణాలు 377 కోట్లు, ఇతర ప్రియారిటీ సెక్టార్లకు 271 కోట్లు, నాన్ ప్రియారిటీ సెక్టార్లకు 5,429 కోట్లు రుణాలు కల్పించేందుకు లక్ష్యం చేపట్టారు.

ఈ సమావేశంలో ఎమెల్సీ కర్రి పద్మశ్రీ, కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిప్యూటీ రీజనల్ హెడ్ వి.కృష్ణమాచారి, ఎల్.డి.యం. సిహెచ్.ఎస్.వి.ప్రసాద్, రిజర్వుబ్యాంకు ఎల్డిఓ ఎ.రామకృష్ణ, నాబార్డు ఏజియం వై.సోమునాయుడు, డిఆర్డిఏ పిడి జి.శ్రీనివాసరావు, మెప్మా పిడి బి.ప్రియంవద, వ్యవసాయశాఖ జెడి ఎన్. విజయకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకుల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## శాశ్వత పరిష్కారం చూపాలి

### గ్రామస్తులుతాత్కాలిక ఉపశమనం




పెనుమంట్ర: జూన్ 24,మార్టేరు గ్రామపంచాయతీ పరిధిలోని సులభ కాంప్లెక్స్ నిర్వాహకుల నిర్వాహకం వల్ల మరుగుదొడ్డి నీళ్లు నెగ్గిపూడి డ్రైనేజ్ కి కలిపి వేయడంతో తీవ్ర దుర్గంధం వస్తుందన్న నేపథ్యంలో 1వ వార్డు సభ్యులు గుత్తుల సాల్మన్ దొర, స్థానికుల ఫిర్యాదుతో వెంటనే స్పందించిన మార్టేరు పంచాయతీ సర్పంచ్, నెగ్గిపూడి పంచాయతీ కార్యదర్శి సంయుక్తంగా మార్టేరు, నెగ్గిపూడి గ్రామాల పారిశుద్ధ్య సిబ్బందితో వెంటనే డ్రైనేజీ క్లీన్ చేయించి, పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు . సంబంధిత శాఖ పూర్తిస్థాయిలో అధికారులు మరుగుదొడ్డి నుండి వచ్చే మురుగునీరు నెగ్గిపూడి గ్రామంలోని ఒకటి, రెండు వార్డులలో గల ప్రధాన వీధుల డ్రైనేజీలలో కలవకుండా చూడాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు మార్టేరు పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది వారు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




## ఆచంట కచేరి సెంటర్లో అన్న క్యాంటీన్ కు శంకుస్థాపన

### పేదోడి ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటీన్లు..

### ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ



ఆచంట : జూన్ 24, పేదవాడికి తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించి వారి ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట కచేరి సెంటర్ లో రూ 61 లక్షలతో నిర్మించనున్న అన్నా క్యాంటీన్ కు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ పేదలకు సబ్సిడీతో కూడిన నాణ్యమైన భోజనం అన్న క్యాంటీన్ ల ద్వారా అందిస్తున్నామని త్వరలోనే భవన నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా మరో 60 అన్న క్యాంటీన్ లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు కార్యక్రమంలో జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, మండల టిడిపి అధ్యక్షుడు చిలుకూరి సీతారాం, సిద్ధాంతం డీసీ చైర్మన్ తమ్మినీడి ప్రసాద్, మండల జనసేన అధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు దాసిరెడ్డి పుణ్యవతి, తమ్మినీడి పృధ్వి, కేతా మీరయ్య, గొడవర్తి శ్రీరాములు బీరా నరసింహమూర్తి, చిలుకూరి సత్యవతి మన్నే విజయ రాధిక, తాసిల్దార్ జి కనకరాజు ఎంపీడీవో కృష్ణమోహన్ వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాతబద్ధతలోనే పాఠశాలను నడపాలి ప్రభుత్వానికి డిమాండ్..

### అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి...కె.రమాదేవి

పెనుమంట్ర : జూన్ 24, పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు ఓడూరు శివరావుపేట స్కూల్స్ నీ కలిపిన నేపథ్యంలో పేద మరియు వెనుకబడిన తరగతుల ప్రాంతాల పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరం అవుతారన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి కే రమాదేవి పెనుమంట్ర బ్రాహ్మణ చెరువు వెలమపేట పాఠశాలకు వెళుతున్న మందులు వారి కాలనీ సందర్శించి వారి తల్లిదండ్రులతోమాట్లాడారు. ఈ స్కూలు వీలైన చేయటం వల్ల మా పిల్లలు మెయిన్ రోడ్ కుండా సుమారు కిలోమీటర్ పైనే దూరం నడుచుకుంటూ వెళ్ళవలసి వస్తుందని మా పిల్లలకు భద్రత కరువు అవుతుంది అని ఐద్వా బృందం ముందు తమ ఆవేదనను వ్యక్తం చేశారు మా స్కూలు మాకు గతంలో ఏ విధంగా నడిచేవో ఆ విధంగానే నడపాలని అన్నారు రమాదేవి గారు మాట్లాడుతూ ప్రభుత్వం పథకం ప్రకారం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయటం కోసం కుట్ర పండుతుందని రమాదేవి గారు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని దూయబట్టారు తక్షణమే ప్రభుత్వం విలీనం చేసే చర్యలను ఆపాలని పాతబద్ధతలోనే పాఠశాలను నడపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఆవిడ వెంట జిల్లా ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు కేత పద్మజ పొగాకు పూర్ణ కౌలు రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కుసమపూడి సుబ్బరాజు కెవిపిఎస్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ ఉన్నారు

## కాకినాడ ఐడిఏ ఆధ్వర్యంలో"ప్రపంచ అప్ సైక్లింగ్ దినోత్సవం



కాకినాడ జూన్ 24 : స్థానిక అయోధ్య నగర్ వద్ద ఉన్న రాధాకృష్ణ బృందావనం లో కాకినాడ ఐడిఏ సభ్యుల చే అప్ సైక్లింగ్ దినోత్సవం సంధర్భంగా విద్యార్థుల కు మన గృహలలో ఉపయోగించిన పాత వస్తువుల ను పర్యావరణ పరిరక్షణ కు అనుకూలంగా ఎలా చేసుకోవచ్చో రాధ గారు ఇంట్లో వాడిన సీసాలు టైర్లు బూట్లు డబ్బాలు లో ఆవిడ పెంచిన మొక్కల కళాకృతులను చూపించారు.కాకినాడ ఐడిఏ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ"1994లో ఇద్దరు జర్మన్ ఇంజనీర్లు, విలియం మెక్‌డొనౌ మరియు మైఖేల్ బ్రాన్‌గార్ట్‌లు అప్‌సైక్లింగ్‌ను కనిపెట్టారని పాత వస్తువులను తిరిగి ఉపయోగించుకునేలా మరియు వాటికి రెండవ జీవితాన్ని ఇచ్చేలా వాటిని పునరుద్ధరించడం చేసారని తెలిపారు .అప్సైక్లింగ్ డే 2025 జూన్ 24న జరుపుకుంటారనిఇది ప్రతి సంవత్సరం నిర్వహించబడే ఒక అంతర్జాతీయ కార్యక్రమం అని ఇది పాత వస్తువులను రీసైకిల్ చేసి, వాటిని వ్యర్థాలుగా మార్చకుండా వాటిని అప్సైకిల్ చేయడంపై దృష్టి పెడుతుందని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ మరియు అప్సైక్లిగ్ లో శ్రీమతి రాధ గారు మన సమాజం లో అందరికీ మార్గదర్శకురాలని అన్నారు.అప్‌సైక్లింగ్ డే అనేది పాత వస్తువులను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణ కు అనుకూలమైనదిగా చేస్తారని ఎందుకంటే ఇది వస్తువులను రీసైకిల్ చేయడానికి మరియు వ్యర్థాలను తగ్గించడానికి సహాయపడుతుందని,అప్‌సైక్లింగ్ డే యొక్క ముఖ్య ఉద్దేశాలలో , పాత వస్తువులను ఉపయోగించి ఉపయోగపడేవస్తువులను తయారు చేయడం, వృధా తగ్గించడం, పర్యావరణానికి సహాయపడటం, సృజనాత్మకతను ప్రోత్సహించడం, అవగాహన పెంచడం అని అన్నారు.ఈ కార్యక్రమం లో కాకినాడ ఐడిఏ సభ్యులు డా సాయికార్తీక్ డా లిఖిత డా శ్రీవల్లి డా చైతన్య డా సిరాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ బీమా పథకం ద్వారా బీమా దారుని కుటుంబానికి ఆర్థిక భరోసా




పోడూరు: జూన్ 24, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకం పేదలకు గొప్ప వరమని పోడూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. పోడూరు మండలం పోడూరు గ్రామంలో ఇటీవల అనారోగ్య సమస్యతో మరణించిన గుడాల రాజేష్ బాబు కుటుంబానికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన ద్వారా వచ్చిన రెండు లక్షల రూపాయలు చెక్కును గ్రామ ప్రముఖులు మరియు మాజీ సర్పంచ్ రుద్రరాజు వరహాల రాజు చేతుల మీదుగా లబ్ధిదారు ( నామిని) గుడాల వెంకటేశ్వరరావు కి మంగళవారం అందజేశారు . కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీస్ రాజమండ్రి నుంచి వచ్చిన ఫైనాన్షియల్ ఇంక్లూషన్ సీనియర్ మేనేజర్ అజ్జల నరేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలందరికీ భీమా ఉండాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన గొప్ప భీమా పథకం అని ఈ పథకం లో చేరి ఏడాదికి కేవలం 436 రూపాయలు ప్రీమియంతో రెండు లక్షలు ఇన్సూరెన్స్ పొందవచ్చు అన్నారు. పాలసీదారుడు ఏ కారణం చేతనైన మరణిస్తే 2 లక్షల రూపాయలు ఇంటికి చేరేటట్లు ఈ పథకం ను రూపొందించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు నుంచి కొంతవరకు బయటపడవచ్చు అన్నారు . 18 నుంచి 50 సంవత్సరాలు లోపు ఉన్న బ్యాంక్ ఖాతాదారులు ఈ ప్రభుత్వ బీమా పథకంలో చేరి లబ్ధి పొందవచ్చు అన్నారు . బ్యాంక్ అకౌంట్లో 436 రూపాయలు ఉంటే ఆటో డెబిట్ ప్రాసెస్ లో సంవత్సరానికి ఒకసారి అకౌంట్ భీమా రుసుము ( ప్రీమియం) చెల్లించబడుతుందాని రోజుకి సుమారుగా ఒక రూపాయి మాత్రమే పడిందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకోవాలని అన్నారు. వరహాల రాజు గారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న గుడాల రాజేష్ బాబు గురించి తెలుసుకుని ఈ ప్రభుత్వ భీమా పథకంలో అతనిని చేరేటట్లు ప్రోత్సహించి ఆ కుటుంబానికి ఎంతో మేలు చేసినందుకు బ్యాంక్ అటెండర్ మీసాల పుల్లారావు అభినం దించారు.

## జూలై నెల 5 న జాతీయ లోక అదాలత్



తాడేపల్లిగూడెం జూన్ 24:పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, జూలై నెల 5వ తేదీ (మొదటిశనివారం) స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ మరియు 11 వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, మెయింటినెన్స్ కేసులు, మోటారు వాహనా ప్రమాద భీమా కేసులు మొదలుకున్నవి కక్ష దారుల మధ్య పరిష్కరింపబడునని, లోక్ అదాలత్ తీర్పుపై అప్పీలు ఉండదని, కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులు రాజీ చేసుకుని రాజీమార్గమే, రాజ మార్గంగా, ఎంచుకొని డబ్బు, సమయం ఆదా చేసుకోవాలని కోరారు.

## నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు – జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం: జూన్ 24 :మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గృహ నిర్మాణ ప్రగతిపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మండలాలవారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలు సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాలలో అలసత్వం వహించే కాంట్రాక్టర్లను తొలగించి అవసరమైతే కొత్తవారిని నియమించుకొని పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలసివారికి అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు వేగవంతం చేయాలన్నారు. మరో 15 రోజుల్లో లక్ష్యాన్నీ పూర్తి చేసి నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ జి.పిచ్చయ్య, జిల్లాలోని డి ఈ లు ఏఈలు పాల్గొన్నారు

# విద్య పట్ల ఆసక్తి ఉన్న వారికి ఓపెన్ స్కూల్ చక్కని సువర్ణ అవకాశం

పది మరియు ఇంటర్మీడియట్ కోర్సులకు జూలై 30వ తేది వరకు ఆన్లైన్ దరఖాస్తుకు అవకాశం

ఆలస్య రుసుముతో ఆగస్టు 1 నుండి 15 వరకు దరఖాస్తు చేయవచ్చు.:జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్

నంద్యాల(విజయ సారథి):విద్య పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఓపెన్ స్కూల్ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యావంతులు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సంబంధిత అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంలో 10 మరియు ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ విద్యాపీఠం జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందియుండి, ఉన్నత చదువులకు మరియు ఉద్యోగాలు పొందుటకు అర్హత కలిగి ఉంటుందన్నారు. పది మరియు ఇంటర్మీడియట్ దూరవిద్య నిమిత్తం ఈనెల 12 నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, జూలై 30 చివరి తేదీలోగా వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఆలస్య రుసుము రూ.200/-లతో ఆగస్టు 1 నుండి 15వ తేది వరకు కూడా ఆన్లైన్ లో దరఖాస్తులు సమర్పించవచ్చునన్నారు. పదవ తరగతిలో నమోదు చేసుకోవడానికి ఎటువంటి విద్యార్హత అవసరం లేదని 14సం.లు పైబడి చదవడం, వ్రాయడం వస్తే సరిపోతుందన్నారు. ఇంటర్మీడియట్ కు మాత్రం పదవ తరగతి పాస్లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలకు కలిపి ఒకే సారి పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు జిల్లాలోని వివిధ మండలాల్లో 25 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు అన్ని పోటీ పరీక్షలు వ్రాయడానికి అర్హులని తెలిపారు. రెగ్యులర్ విధానంలో పాఠశాల, కళాశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడేవారు సెలవు రోజుల్లో, ఆదివారాల తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్షలు వ్రాసే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలు, మైనార్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. చదువు మధ్యలో ఆపేసిన వారికి ఇదొక సువర్ణ అవకాశం అని ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు.పోలీసు శాఖ, ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు, తహాశీల్దార్లు, విఆర్ఓలు, మెప్మా, డిఆర్డిఎ, ఐసిడిఎస్, డ్వామా, వైద్య శాఖలు క్రింద స్థాయి సిబ్బందితో పాటు విద్య పట్ల ఉత్సుకత ఉన్న వారికి అవగాహన కల్పించాలన్నారు. వయోజన విద్యా శాఖ వాలంటీర్ల ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ఓపెన్ స్కూల్ కు సంబంధించి బ్యానర్స్, పోస్టర్లను



ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు డిఆర్ఓ సూచించారు. అదే విధంగా అన్ని అసంఘటిత రంగ కార్మికులు మరియు వారి కుటుంబాలతో కలిసి నమోదును ప్రోత్సహించాలని కార్మిక శాఖ అధికారిని, పాఠశాలలో డ్రాపౌట్‌లను గుర్తించి, వారిని ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల వైపు ప్రోత్సహించేలా పాఠశాల యాజమాన్యం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లతో అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష అధికారులు సమన్వయం చేసుకోవాలని డిఆర్వో పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఈఓ జనార్ధన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో స్పర్శ దర్శనం పున ప్రారంభం

జూన్ 24 భక్తుల సౌకర్యార్థం జూలై 1 నుంచి శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనం పునః ప్రారంభంగతంలో వలనే మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉచిత స్పర్శదర్శనంస్పర్శదర్శనానికి సంప్రదాయ వస్త్రధారణ తప్పని సరిఉచిత స్పర్శదర్శనానికి టోకన్ల జారీభక్తుల సౌకర్యార్థం జూలై 1వ తేదీ నుంచి శ్రీస్వామివార్ల ఉచిత స్పర్శదర్శనం పున:ప్రారంభించబడుతుంది. గతంలో వలనే వారంలో నాలుగురోజులపాటు అనగా మంగళ, బుధ, గురు,శుక్రవారాలలో ఈ ఉచిత స్పర్శదర్శనం కల్పించబడుతోంది. ఈ రోజులలో 2 గంటల పాటు అనగా మధ్యాహ్నం గం. 1. 45 ల నుంచి 3. 45ల వరకు ఈ ఉచిత స్పర్శదర్శనం కొనసాగుతుంది.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ, శ్రీ మల్లికార్జునస్వామివారిని స్వయంగా స్పర్శించడం ద్వారా ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలనే ప్రతీ భక్తుడి కోరికకు అనుగుణంగా ఈ ఉచిత స్పర్శదర్శన సౌకర్యం పునః ప్రారంభించడం జరుగుతోందన్నారు. సామాన్య భక్తులు ఎటువంటి రుసుమును చెల్లించకుండా ఉచితంగా శ్రీస్వామివారి స్పర్శదర్శనం చేసుకునేందుకు ఈ అవకాశం కల్పించడుతోందన్నారు.ఉచిత స్పర్శదర్శనంలో కూడా జవాబుదారీతనం మరియు పారదర్శకత కోసం కొత్తగా టోకన్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఉచిత దర్శనం కోసం ఏరోజుకారోజు కౌంటర్ల ద్వారా టోకన్లను జారీ చేయబడుతాయన్నారు.ఈ కంప్యూటరైజుడు టోకన్లలో: భక్తుని పేరు, ఆధార్ నెంబరు మరియు ఫోన్ నెంబరును నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ టోకన్లను ఉచిత దర్శనం ప్రవేశద్వారం వద్ద గల స్కాంగ్ ద్వారా తనిఖీ చేసి భక్తులను ఉచిత స్పర్శదర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు.అవకాశాన్ని బట్టి రోజుకు 1000 నుంచి 1200 టోకన్లు జారీ చేయబడుతాయన్నారు. టోకన్లు పొందిన భక్తులు మాత్రమే ఉచిత స్పర్శదర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు. కావున ఉచిత స్పర్శదర్శనాన్ని పొందగోరే భక్తులు తప్పనిసరిగా ఈ ఉచిత టోకన్లను పొందవలసి వుంటుందన్నారు.

## వామపక్ష విద్యార్థి సంఘం నేత పి.మర్రిస్వామి పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘంలో చేరిక

పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు రఫీ..




నందికొట్కూరు జూన్ 24:-నందికొట్కూరు డివిజన్ పరిధిలోని వామపక్ష విద్యార్థి సంఘం జిల్లా సీనియర్ నాయకులు కామ్రేడ్ పి.మర్రి స్వామి నేడు నందికొట్కూరు పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ నందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంలో పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,సమక్షంలో చేరారు.ఈ సందర్భంగా పిడి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ .ఎండి రఫీ, మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్ పరిధిలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన కామ్రేడ్ పి.మర్రిస్వామిని నంద్యాల జిల్లా కార్యదర్శి గా ఎన్నుకోవడం జరిగింది. విప్లవ విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యు లో చేరడం అభినందనీయం అని తెలియజేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టేందుకు విద్యార్థులు సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.కామ్రేడ్ మర్రి స్వామి మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఉద్యమిస్తున్న విప్లవ విద్యార్థి సంఘం పిడిఎస్.యు లో చేరుతున్నానని తెలియజేశారు.శాస్త్రీయ విద్యా సాధన కోసం ,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నేటి నుండి పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## వర్షం కోసం పూజా కార్యక్రమాలు



నందికొట్కూరు జూన్ 24:-నందికొట్కూరు లో వర్షాల కోసం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు 108 కళాశాలతో శివునికి జలాభిషేకం నిర్వహించారు. సందర్భంగా ఎరువులు పురుగుల మందుల డీలర్లు, విత్తనాల డీలర్లు 108 కళాశాలతో శివుడికి జలాభిషేకం,వరుణ యాగం నిర్వహించారు.సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణ లో సతీ సమేతంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎరువులు, విత్తనాల,పురుగుల మందుల డీలర్లు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ కార్పొరేట్ దోపిడి ఆగేదెప్పుడు ఆంధ్ర విద్యార్థి సంఘం

నందికొట్కూరు జూన్ 24:- జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థలు విద్యార్థులు తల్లిదండ్రు వద్ద నుండి ఆర్థిక దోపిడీ ఆగేది ఎప్పుడు అని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నంద్యాల జిల్లా ఆంధ్ర విద్యార్థి



సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి (డి ఈ ఓ) కు వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి.పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టు,షూలు వంటి వాటిని అమ్ముతూ విద్యను వ్యాపారంగా మలుస్తున్నాయి. ఇది విద్యా హక్కు చట్టానికి పూర్తిగా వ్యతిరేకం.విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్న ఈ విధానాలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలి. అలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలనిపిల్లల భవిష్యత్తుతో చెలగాటం ఆడే విధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై విద్యా శాఖ బహిరంగంగా విచారణ జరిపి, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అజయ్, సోషల్ మీడియా కన్వీనర్ లతీఫ్, కార్యకర్తలు లోకేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం ఇదే విధంగా ఆంధ్ర విద్యార్థి సంఘం పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి




నందికొట్కూరు జూన్ 24:- నంద్యాల జిల్లా మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది.వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివారు.మండల వ్యవసాయ అధికారి పీరు నాయక్ మాట్లాడుతుండగా సహకార సొసైటీలో రాబోయే రబీకి ముందుగానే నాణ్యమైన విత్తనాలు ఫర్టిలైజర్ ఎక్కువ స్టాక్ ఉంచుకోవాలని రైతులకు కావలసిన వాటిని మార్కెట్ తరపున సహకారం అందిస్తామని ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ రెడ్డి ఎంఏఓకు సూచించారు.కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను సరిచేయాలని విద్యుత్ శాఖ ఏఈ క్రాంతి కుమార్ కు సూచించారు.మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డు అధ్వానంగా ఉందని అదేవిధంగా పీరు సాహెబ్ పేట రోడ్డు మరియు మిడుతూరు గార్గేయపురం రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురి అవుతున్నారని రోడ్లను బాగు చేయాలని మీరు మండలంలో పర్యటించారు ఎప్పుడో వస్తారు వెళ్తారంటూ ఆర్అండ్ బీ ఏఈ మనోధర్ ను ప్రజా ప్రతినిధులు నిలదీశారు.జలకనూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గతంలో 110 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 47 మంది మాత్రమే ఉన్నారని అందరూ ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని కనీసం పాఠశాలల వైపు చూడాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ ఎంఈఓ ఫైజున్నిసా బేగంను గ్రామ సర్పంచ్ కురువ ఎల్లయ్య ప్రశ్నించారు.రాస్తా లేని పొలాలకు రస్తా ఇవ్వమని జీవో వచ్చింది గత ఆరు నెలలుగా తిరుగుతున్నా పొలాల రస్తాలకు దారి చూపడం లేదని గ్రామంలో లేనిపోని సమస్యలు తహసిల్దార్ సృష్టిస్తున్నారంటూ తలముడిపి సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి దశరథ రామయ్య మరియు మండల అధికారులు పాల్గొన్నారు.




## రియల్ మోసంలో వైకాపా నేత తనయుడు

ఒంగోలులో ఎపి ఇన్‌ఫ్రాకాన్ నేత విజయ్ అరెస్ట్

గాలింపుతో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు

ఒంగోలు,జూన్ : రియల్ ఎస్టేట్ పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన విజయవాడ వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు కుమారుడు లక్ష్మీ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ స్కీంల పేరుతో విజయ్ చీటింగ్‌కు పాల్పడ్డాడు ఏపీ ఇన్ ఫ్రాన్ పేరుతో 22 రకాల ప్రాజెక్టుల పేర్లు చెప్పి కోట్ల రూపాయలు వరకు ప్రజల నుంచి వసూలు చేశాడు. అయితే పెట్టుబడి పెట్టిన వారికి ప్లాట్లు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. కాలం గడుస్తున్నప్పటికీ తమకు ప్లాట్లు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎట్టకేలకు ఒంగోలులో లక్ష్మీ విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దాదాపు 200 మంది బాధితులను లక్ష్మీ విజయ్ కుమార్ మోసం చేసినట్లు తెలుస్తోంది. వెయ్యి కోట్లు టర్నోవర్ ఉన్న పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థ అంటూ జోరుగా ప్రచారం చేశాడు. ఎత్తైన భవనాలు, ఆకర్షణీయ వెంచర్లను చూపి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు చేశాడు. పథకాల పేరుతో దగా చేసిన వైనం బయటపడింది. అమ్మకాలు అద్భుతంగా ఉన్నాయంటూ మోసం చేసి ప్రజల నుంచి కోట్లలో వసూలు చేశాడు. విజయ్ కుమార్‌ను నమ్మి అద్భుతమైన ప్లాట్లు సొంతమవుతాయని భావించిన బాధితులు తమ దగ్గర ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టేశారు. అయితే ఎన్ని రోజులైనా విజయ్ కుమార్ ప్లాట్లు ఇవ్వకపోవడంతో అతడిని నిలదీశారు. అడిగిన వారిని వాట్సప్ గ్రూపుల్లో తొలగించి, కార్యాలయానికి రాకుండా ఆంక్షలు విధించాడు విజయ్. స్కీమ్-1లో రూ.2 నెలవారి వడ్డీ, స్కీమ్-3లో రూ.3 వడ్డీ మూడు నెలలకు ఒకసారి చెల్లింపులు అంటూ చేతులెత్తేశాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రభుత్వం కూడా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మీ విజయ్‌ను అరెస్ట్ చేసేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కేసు నమోదు అవడంతో పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు.

## ప్రజలందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



తాడేపల్లిగూడెం జూన్ 24పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, ప్రజలందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని , ప్రజలందరికీ మంచి జరగాలని రొక్కాల నాగ బుజ్జి స్వచ్ఛందంగా ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని బిజెపి పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు.మంగళవారం ఎల్ అండ్ టి కాలనీ క్రీస్తు సంఘము చర్చి ఆధ్వర్యంలో చుక్కా ఐజాక్ , మరియా దంపతుల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం స్థానిక దైవజనులు రొక్కాల నాగ బుజ్జి అధ్యక్షతన నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్య శాల డాక్టర్. జి. రూప 144 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బిజెపి పార్టీ నాయకులు బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com